ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

ఏప్రిల్ 2009

వెల : రూ. 10

ఇదిగో భద్రాద్రి..

గౌతమి అదిగో చూడండి...



సుబోధ

గృహస్థులు కూడా భగవత్సాక్షాత్కారం పొందవచ్చు. అందుకు జనక మహారాజే నిదర్శనం. అతడు రాజర్షి. కానీ హఠాత్తుగా జనకుడిలా అవడం అందరికీ సాధ్యం కాదు. జనకమహారాజు లోకవ్యవహార కల్లోలానికి దూరంగా ఏకాంతవాసం చేస్తూ, భక్తిసాధనలను ఎన్నో ఏళ్ళు కొనసాగించాడు. కాబట్టి గృహస్థులు అప్పుడప్పుడు ఏకాంతవాసం చేస్తూ ఉండాలి. భగవత్సాక్షాత్కారాన్ని పొందే నిమిత్తం సాధనలు చేయడం ఎంతో శ్రేయస్కరం.

ఒకరోజు బ్రహ్మసమాజపు యువకులు కొందరు తాము జనకుణ్ణి ఆదర్శంగా తీసుకొని సంసారంలో మెలగుతున్నామని నాతో చెప్పారు. అందుకు నేను వారితో ఇలా అన్నాను: "జనకుడిలా ఉన్నానని చెప్పడం సులువే! కానీ జనకుడి లాగ వర్తించటం కష్టతరం. ఏ విధమైన సంగం లేకుండా, మాలిన్యాన్ని పొందకుండా ఐహిక విషయాల మధ్య మెలగడం చాలా కష్టం. ప్రారంభదశలో జనకుడు ఎటువంటి కఠిన నియమాలను పాటించి, తపస్సు చేశాడో తెలుసా? కానీ మిమ్మల్ని అలా కఠిన నియమాలను పాటించాల్సిందిగా చెప్పను. ప్రశాంతమైన స్థలంలో ఒంటరిగా కొంతకాలం నివసించండని మిమ్మల్ని కోరుతున్నాను. జ్ఞానాన్నీ, భక్తినీ సముపార్జించుకొని అప్పుడు సంసారంలో ప్రవేశించవచ్చు. కదపకుండా ఒకచోట పెట్టినప్పుడే పాలు, గట్టి పెరుగుగా తోడుకుంటాయి. పాలను కదిపినా, ఒక కుండ నుంచి మరో కుండలోకి మార్చినా పాలు తోడుకోవు. జనకుడు నిస్సంగుడు. అందువల్ల అతడికి 'విదేహుడు' అనే పేరు వచ్చింది. అతడు జీవన్ముక్తుడై మెలిగాడు. దేహబుద్ధిని నిర్మూలించుకోవడం ఎంతో కష్టం. జనకుడు నిజానికి ఒక వీరుడు. ఒక చేతిలో జ్ఞానాన్నీ, రెండో చేతిలో కర్మలనే ఖడ్గాన్నీ అవలీలగా ధరించిన ధీరుడు!" ❖

('శ్రీరామకృష్ణ బోధామృతం' నుంచి)

శ్రీరామకృష్ణ ప్రభ

రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాద్ – 500 029

ఫోన్: 040–2766 7799, 2763 3936

E-mail : sriramakrishnaprabha@gmail.com

నిర్వాహక సంపాదకులు: స్వామి జ్ఞానదానంద

సంపాదకులు: స్వామి పరిజ్ఞేయానంద

సురభి

నేను (నీలకాంత్ చక్రవర్తి), మరో ముగ్గురు మిత్రులం కలిసి జయరాంబాటీ వెళ్ళాం. మధ్యాహ్నం పన్నెండున్నర గంటలకు ప్రసాదం స్వీకరించడం కోసం వసారాలో కూర్చున్నాం. వాతపునొప్పుల కారణంగా మాతృదేవి కాస్త కుంటుతూ నడిచారు. అయినప్పటికీ అందరికీ తామే స్వయంగా వడ్డించారు.

నేను: అమ్మా, ఇక్కడ చాలా మంది ఉన్నారు కదా! మీరే స్వయంగా ఎందుకు వడ్డించాలి?.

మాతృదేవి: నాయనా! బిడ్డలకు స్వహస్తాలతో వడ్డించి తినిపించకపోతే తల్లి మనస్సు కలత చెందుతుంది.

మర్నాటి ఉదయం స్నానం చేయడానికి నేను చెరువు వద్దకు వెళ్ళాను. దారిలో నేను చూసిన దృశ్యం నన్ను ఆశ్చర్యపరచింది. ఒక పెద్ద బిందెను చంకన పెట్టుకుని చెరువు నుంచి మాతృదేవి నీళ్ళు తీసుకువస్తున్నారు. ఇంతమంది ఉండగా మీ రెందుకు ఇవన్నీ చేస్తున్నారని అడిగినప్పుడు, “నాయనా! దీని వల్ల నా కెలాంటి శ్రమా లేదు. ఇవన్నీ నాకు అలవాటైపోయాయి” అని ఆమె జవాబిచ్చారు. మరునాడు ఉదయం కామార్పుకూర్‌కు వెళ్ళి, గురుదేవుల జీవితంతో ముడిపడివున్న స్థలాలను సందర్శించాం. మాణిక్‌రాజా మామిడి తోటలో చాలాసేపు గడిపాం. అందువల్ల తిరిగి వచ్చేసరికి రాత్రి చాలా పొద్దుపోయింది. పాండుజ్యే చెరువు వద్దకు చేరేసరికి దూరంగా ఎవరో ఒక వ్యక్తి చేత లాంతరు పట్టుకొని నిలబడి ఉండడం కనబడింది. దగ్గరకు వెళ్ళి చూడగా మేం చూసిన దృశ్యం మమ్మల్ని ఆశ్చర్యచకితుల్ని చేసింది. సాక్షాత్తూ శారదాదేవియే లాంతరు పుచ్చుకొని అక్కడ నిలబడి ఉన్నారు.

“అమ్మా! మీరా ఇక్కడ?” అని మేము అడిగినప్పుడు మాతృదేవి ఆప్యాయత ఉట్టిపడే స్వరంతో, “నాయనా! మీరు బయటి ఊరి వాళ్ళు. పైగా చిమ్మచీకటి. దారి తప్పవచ్చు. అందువల్ల నా మనస్సు ఎంతో ఆందోళనకు గురైంది. అందుకే లాంతరు పుచ్చుకుని మీ కోసం ఎదురు చూస్తూ నిలబడి ఉన్నాను” అని చెప్పారు. ఆ మాటలు విని మేం నిశ్చేష్టులమయ్యాం. శిలాప్రతిమలలా నిలబడిపోయాం. ఈ మాతృమూర్తి కారుణ్యానికి సాటి ఉందా? ❖

(నీలకాంత్ చక్రవర్తి స్మృతుల నుంచి)

With Best Compliments From
CHAIRMAN & MANAGING DIRECTOR
THE KCP LIMITED
KCP కంపెనీ వారు ‘శ్రీరామకృష్ణ ప్రభ’ మాసపత్రికను 1000 గ్రంథాలయాలకు స్పాన్సర్ చేశారు.

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

సంపుటం: 66 సంచిక: 4 ఏప్రిల్ 2009

ఏవం కృతా యేన విచిత్రలీలా మాయామనుష్యేణ నృపచ్ఛలేన,
తం వై మరాలం మునిమానసానాం శ్రీజానకీ జీవనమానతోఽస్మి.

మాయామానుష రూపంతో, రాజలాంఛన మిషతో, లోకోత్తరమైన లీలల్ని ప్రదర్శించిన మునిమానస రాజహంస అయిన శ్రీజానకీ ప్రాణనాథునికి నమస్కరించుచున్నాను.

(శ్రీజానకీ జీవనాష్టకమ్)

లోపలి పేజీల్లో...

4
సంపాదకీయం
హరిణిని స్మరించి హరిని విస్మరిస్తే...!

10
దేవీ వైభవం

6
గోరుముద్ద
పతనానికి దారి 'పరనింద'

12
భ్రమలు విడనాడండి!

7
దాస్యభావంలో దివ్యానుభూతులు

13
ధీరవాణి
మనోభావాలెన్నో మతాలన్ని!

8
అనుగ్రహించిన ఆదిపరాశక్తి

15
ఆచారవ్యవహారాలు– అంతరార్థాలు
అతి ముఖ్యమైన ఆ ఎనిమిది పుష్పాలు

9
పరమేశ్వరుని పరిరక్షణలో...
యాచకుని సేవలు యాదృచ్ఛికం!

16
బొమ్మల కథ
రామరాజ్యంలో ధర్మస్థాపన



శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి



ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు 'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'లో సభ్యులుగా చేరి ధనదానం చేయాల్సిందిగా మనవి. సభ్యుల పేర్లు పత్రికలో ప్రచురిస్తాం.

మహారాజ పోషకులు......	రూ.	10,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
రాజ పోషకులు............	రూ.	5,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
పోషకులు.................	రూ.	1,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.

	దాత పేరు	చిరునామా	రూ.
మహారాజ పోషకులు	:	శ్రీ గౌరీశంకర బాబు, నుంగంబాకం, చెన్నై - 600 034	15,000
పోషకులు	:	శ్రీమతి & శ్రీ కెంచె మురుడప్ప, రాయదుర్గ్, అనంతపురం జిల్లా	1,625
" "	:	శ్రీమతి కె. కళావతి, ఆల్వాల్, సికింద్రాబాద్-500 010	1,116
" "	:	శ్రీ వి.వి.ఎన్. శర్మ, ఉప్పల్, హైదరాబాద్ - 500 039	1,116
" "	:	శ్రీ కాపర్తి కృష్ణమూర్తి, మాసైపేట్, మెదక్ జిల్లా	1,116
" "	:	శ్రీ కాపర్తి రామచంద్రయ్య, మాసైపేట్, మెదక్ జిల్లా	1,116
" "	:	శ్రీ కాపర్తి శంకరయ్య, మాసైపేట్, మెదక్ జిల్లా	1,116
" "	:	శ్రీ కాపర్తి శివకుమార్, మాసైపేట్, వెల్దుర్తి, మెదక్ జిల్లా	1,116
" "	:	శ్రీ సిలువేరి సుదర్శన్, అరవింద్ నగర్, హైదరాబాద్	1,000
" "	:	శ్రీ ఎన్.పి. కేశవరెడ్డి, కొల్లగల్లు, బళ్ళారి, - 583 104	1,000
" "	:	శ్రీ ఎమ్. సుధాకర్, మదనపల్లి, చిత్తూరు జిల్లా (కీ॥శే॥ ఎమ్.వి. లక్ష్మమ్మ శెట్టి జ్ఞాపకార్థం)	1,000
" "	:	శ్రీ నవీన్‌తేజ, జి.ప. ఉన్నత పాఠశాల, పరవాడ, విశాఖపట్నం - 531 021	1,000

ముఖచిత్రం : 'శ్రీ సీతా లక్ష్మణ భరత శత్రుఘ్న హనుమత్ సమేత శ్రీరామచంద్రుని పట్టాభిషేకం'

ఈ సన్నివేశాన్ని చిత్రీకరించిన కళాకారుడు మణియన్ సెల్వమ్, చెన్నై. (చెన్నై, శ్రీరామకృష్ణ మఠం సౌజన్యంతో)

ADVERTISEMENT TARIFF

	MULTI COLOUR	B & W
Fourth Cover	Rs.25,000	-
Second Cover	Rs.20,000	-
Third Cover	Rs.20,000	-
Inside Full Page	Rs.15,000	10,000
Inside Half Page	Rs.10,000	5,000

చందా వివరాలు		ఇండియాలో	విదేశాలలో
విడి ప్రతి	:	రూ. 10	-
ఒక సంవత్సర చందా	:	రూ. 100	$ 25
మూడు సంవత్సరాలకు	:	రూ. 280	$ 55
ఐదు సంవత్సరాలకు	:	రూ. 450	$ 85
ఇరవై సంవత్సరాలకు	:	రూ. 1500	$ 365

గమనిక : డిమాండ్ డ్రాఫ్ట్, మనియార్డర్లలో **Ramakrishna Math, Hyderabad** అని వ్రాయాలి.
పంపవలసిన చిరునామా : **Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029.**

లోపలి పేజీల్లో...

18
పరిత్యాగంతో
పరిపూర్ణత

28
యువవాణి
నవతరం సందేహాలకు సమాధానాలు

20
ఇదిగో భద్రాద్రీ..
గౌతమి అదిగో చూడండి...

29
మహనీయుల జీవితాల్లో మధురఘట్టాలు
అసంభవమన్నది లేనే లేదు!

23
నరహరి గురుభక్తి

30
విద్యలో విలువల
ఆవశ్యకత

24
కష్టం కష్టం కాదనే
'కిరాతార్జునీయం'

33
నా జీవితంలో స్వామి వివేకానంద
స్వామీజీ ఇచ్చిన అస్త్రాలు

26
వివేకానందకు
విలువైన కానుక!

34
అపజయాలు
విజయభవనానికి సోపానాలు

27
మనసు-మర్మం
మనసుతో మల్ల యుద్ధం!

35
అవకాశం సర్వాంతర్యామి

శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు పైన చిరునామాకి కుడి భాగంలో మీ చందా గడువు నెల పొందుపరచబడి ఉంది. సకాలంలో సొమ్ము చెల్లించి, చందా పొడిగించుకొని, 'శ్రీరామకృష్ణ ప్రభ' ఆధ్యాత్మిక వెలుగులు మీ ఇంట నిరంతరాయంగా ప్రసరించేలా సహకరించండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నెంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారితే వెంటనే మాకు తెలియపరచి, సహకరించ మనవి.
- పత్రిక ప్రతీ నెల 26వ తేదీన పోస్ట్ చేయబడుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపు చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ....

- సర్క్యులేషన్ మేనేజర్

ఈ సంచికలోని రచయిత(త్రు)ల అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి. సంపాదకుడు గానీ, హైదరాబాద్ రామకృష్ణ మఠం గానీ వాటికి బాధ్యత వహించజాలరు.

- సంపాదకులు

SRI RAMAKRISHNA PRABHA, RAMAKRISHNA MATH
Domalguda, Hyderabad - 500 029. Andhra Pradesh
Phone No: 040 - 2766 7799, E-mail : sriramakrishnaprabha@gmail.com

సంపాదకీయం

హరిణిని స్మరించి హరిని విస్మరిస్తే...!

'ఆత్మసాక్షాత్కారమే జీవిత పరమార్థం'అని ఆధ్యాత్మిక మార్గంలో పయనించే సాధకులకు మార్గం మధ్యలో ఎన్నో ప్రలోభాలూ, ఆకర్షణలూ ఎదురై వారి గమ్యాన్ని మరిచేలా చేస్తాయి, మనసుని మభ్యపెట్టి మార్గం నుంచి మరల్చేలా చేస్తాయి. సకల రాజభోగాలనూ, రాజ్యాధికారాలనూ త్యజించి ఆత్మ సామ్రాజ్యానికి అధిపతి కావాలనుకున్నాడు భరతుడు. కృతనిశ్చయంతో సాధన చేస్తున్న అతనికి ఒక లేడి పిల్లపై కలిగిన రాగం, అనురాగంగా మారి తన లక్ష్యాన్ని మరచిపోయేలా చేసింది. 'ఇహ ప్రేత్య చ నారీణాం పతిరేకో గతిః సదా' – ఇహపరములందు సతికి పతియే దైవమనీ, ఉత్తమగతి అనీ శ్రీరామునికి సతీధర్మాన్ని తెలియజేసిన సీతాదేవి ఒక లేడిని పొందాలనే వాంఛ వల్ల పరమాత్ముని సన్నిధిని కోల్పోయింది.

సాధకులు తమ లక్ష్యసిద్ధిని సాధించడంలో సదా అప్రమత్తులై మెలగాలి అనడానికి పైరెండు ఉదాహరణలే చాలు. సాధకుల్ని పతనం చేయడానికి ప్రలోభాలు శత్రువుల రూపంలో కాకుండా మిత్రుల రూపంలోనే వస్తాయి. భరతునిలోని దయాగుణం లేడి పిల్లపై వ్యామోహాన్ని పెంచి, లక్ష్యాన్ని మరిచేలా చేసింది. అలాగే సీతమ్మలోని దానగుణం సాధురూపంలో వచ్చిన రావణాసురుడికి భిక్ష ఇచ్చి, రామునికి దూరమయ్యేలా చేసింది.

సీతాదేవి జీవితాన్ని మన సాధన జీవితంతో అన్వయించుకొని అప్రమత్తులమై ఎలా వర్తించాలో తెలుసుకుందాం.

పసిడి లేడిని కోరి పరంధాముణ్ణి కోల్పోయిన సీతమ్మ:

'యది గచ్ఛసి మాం త్యక్త్వా ప్రాణాంస్త్య క్ష్యామి తేఽగ్రతః'–శ్రీరాముని సహచర్యం లేకపోతే ప్రాణత్యాగం చేస్తాననీ, ఆయన లేని అయోధ్య అరణ్యంతో సమానమనీ, పతిదేవుని చెంతలేని స్వర్గసీమైనా నరకతుల్యమేననీ, దండకారణ్యంలో ఎలాంటి దుర్భర బాధలనైనా భరిస్తాననీ, పతి సన్నిధే పరమ పెన్నిధి అని భావించి రామునితో అరణ్యవాసానికి పయనమైంది సీతమ్మ. పంచవటిలోని పర్ణశాల యందు పతి సాన్నిధ్యంలో ఆనందంగా జీవితాన్ని సాగిస్తున్న సీతమ్మ కళ్ళలో ప్రకాశమానమైన పసిడిలేడి పడింది. ఆ లేడిని పట్టితెమ్మని పంపి నిత్యప్రకాశుడైన పరంధాముణ్ణి దూరం చేసుకుంది. **'తమేవ భాంతమనుభాతి సర్వం తస్యభాసా సర్వమిదం విభాతి'** ఎవరి సన్నిధిలో సకల చరాచర సృష్టంతా ప్రకాశిస్తుందో అలాంటి పరమాత్ముణ్ణి ప్రక్కనే పెట్టుకుని అశాశ్వతమైన ఒక అల్పజీవి తళుకుబెళుకులకు ఆకర్షితురాలైంది సీతమ్మ.

మన ఆధ్యాత్మిక జీవితం కూడా ఒక దండకారణ్యవాసం లాంటిదే. సదా అప్రమత్తంగా లేకపోతే విషయాకర్షణలనే క్రూరమృగాల కోరల్లో చిక్కుకోవడం ఖాయం. 'అతడే మన దిక్కు, అతడే మన గమ్యం' అని ఆధ్యాత్మిక జీవితాన్ని

ప్రారంభిస్తాం. సాధనలో తీవ్రత సన్నగిల్లినప్పుడు మనస్సు నిత్యసత్యుడైన భగవంతుణ్ణి వదలి అనిత్యమూ, అసుఖమైన విషయ వస్తువులవైపు పరుగులు తీస్తుంది. **'ధ్యాయతో విషయాన్ పుంసః సంగస్తేషూపజాయతే సంగాత్సంజాయతే కామః'** విషయ వస్తువుల మధ్య ఉంటే మనసు వాటి ధ్యాసలో పడుతుంది. దానివల్ల వాటిపై రాగం కలుగుతుంది. ఆ రాగం వల్లనే వాటిని పొందాలనే కోరిక బలపడుతుంది. ఆ కోరికను నెరవేర్చుకోవడానికి మనసు ఎన్నో పన్నాగాలు పన్నుతుంది. వాటిని పొందాలనే ఆరాటంలో భగవంతుని

ఆరాధనను విస్మరిస్తుంది. కాబట్టి సాధకుడు విషయ వస్తువులకు దూరంగా ఉండాలి. అలాకాక విషయ వస్తువుల్ని కోరి విశ్వేశ్వరుణ్ణి వదిలితే, పసిడి లేడి కోసం పరంధాముణ్ణి కోల్పోయిన సీతమ్మలా మనం కూడా కష్టాలను అనుభవించాల్సి వస్తుంది.

కోరికల కొలనులో మునిగిన మనసు : భగవంతుడు మనల్ని సాధనామార్గం నుండి పతనం కాకుండా అప్రమత్తుల్ని చేస్తూ ఉంటాడు. కానీ కోరికల కొలనులో మునిగిన మనస్సు భగవంతుని హెచ్చరికల్ని పట్టించుకోదు.

సీతమ్మ కోరిక మేరకు లేడిని తీసుకురావడానికి వెళ్ళినప్పుడు, సీతమ్మ రక్షణ బాధ్యతను లక్ష్మణునికి అప్పగించాడు శ్రీరాముడు. కానీ రామునికి ఆపద వాటిల్లిందని అనుకొని లక్ష్మణుణ్ణి రాముని వద్దకు వెళ్ళమని ఆజ్ఞాపించింది సీతమ్మ. లక్ష్మణుడు 'నేను వెళ్ళిపోతే మీకు ఆపద సంభవించవచ్చు'అని ఎంత విశదపరిచినా సీతమ్మ వినలేదు. పైగా కోపోద్రిక్తురాలై లక్ష్మణుణ్ణి దుర్భాషలాడింది.

మనం కూడా సాధనా పథం నుంచి పతనమయ్యే పరిస్థితుల్లో ఉన్నప్పుడు భగవంతుడు మనల్ని రక్షించడానికి ఎవరో ఒకరి ద్వారా హెచ్చరికలు చేస్తూ మన తప్పులను సరిదిద్దడానికి ప్రయత్నిస్తాడు. కానీ కోరికలతో నిండిన మనసు ఇతరుల హితవచనాల్ని స్వీకరించదు. కాబట్టి మన శ్రేయస్సుని కాంక్షించిన వారిపైన కోపాన్ని ప్రదర్శించకుండా వారి సూచనలను స్వీకరించడం శ్రేయస్కరం.

రాముడులేని ప్రదేశం కాముని నివాసం : రాముని సన్నిధిలో సీతమ్మ ఉన్నంత వరకూ కాముడైన రావణాసురుడు దరిచేరలేదు. ఎప్పుడైతే పంచవటికి దశరథరాముడు దూరమయ్యాడో వెంటనే దశముఖ రావణుడు ప్రవేశించాడు.

భగవంతుడు మనతో ఉన్నంత వరకూ ఈ మాయా మోహిత ప్రపంచం మనకు ఎలాంటి హానీ తలపెట్టలేదు. జాలరి పాదాల చుట్టూ తిరుగుతున్న చేపలు, ఆయన వేసిన వలలో ఎలా చిక్కవో, అలాగే భగవంతుని పాదాలను ఆశ్రయించిన భక్తులు మాయా వలయంలో చిక్కుకోరు. కాబట్టి సదా మనం దేవుని సన్నిధిలో ఉండడానికి ప్రయత్నిస్తే దానవుడు దరిచేరడు.

పరితాపమే పరమాత్ముని దరికి చేర్చే వారధి : శ్రీరామునికి దూరమైన సీతమ్మ రావణాసురుని స్వాధీనమైంది. అశోకవనంలో ఆమె జీవితం శోకమయంగా మారింది. మనం ఎప్పుడైతే భగవంతుణ్ణి విస్మరిస్తామో అప్పుడు కామాసురుడి కబంధహస్తాలలో బందీ అవుతాం. ఒక అల్పమృగాన్ని ఆశించడం వల్ల ఆనందస్వరూపుడైన రాముణ్ణి

ఏప్రిల్ 3న శ్రీరామనవమి

కోల్పోయింది సీతమ్మ. అప్పుడు అశోకవనంలోని శింశుపావృక్షం క్రింద కూర్చొని పశ్చాత్తాప హృదయంతో విలపించింది. శోక సముద్రంలో మునిగి ఉన్న సీతమ్మ స్థితిని (అధ్యాత్మ రామాయణములో) ఆంజనేయస్వామి ఇలా వివరించాడు:

ఏకవేణీం కృశాం దీనాం మలినాంబరధారిణీమ్
భూమౌ శయానాం శోచంతీం రామరామేతి భాషిణీమ్

"జడలు కట్టిన కేశాలతో ఏకవేణియై, కృశించిపోయి, మలినాంబరధారియై, కటిక నేలపై కూర్చొని శోకిస్తూ 'రామా! రామా!' అని స్మరిస్తూంది సీతమ్మతల్లి".

సీతమ్మ హృదయమంతా రామ చింతనతో నిండిపోయింది. ఒకప్పుడు పసిడిలేడిని చూచి మోహితురాలైన ఆమె ఇప్పుడు రావణాసురుడు వచ్చి "సీతా!నీకు కావలసిన సంపదలన్నీ ఇస్తాను, నువ్వు కోరితే సమస్త ప్రపంచాన్నే నీముందు ఉంచుతాను"అని ఆశ చూపించినా ప్రలోభపడలేదు.

భగవంతుణ్ణి తప్ప అన్యమైనదేదీ ఆశించనప్పుడు బాహ్య ఆకర్షణలు మనల్ని మభ్య పెట్టలేవు. If God were always the only object of our desire; we would not so easily be disturbed by the temptations of the world. పరుల నిధుల కంటే పతి సన్నిధియే మిన్న అని సీతమ్మ దృఢ మనస్కురాలై శ్రీరాముని సాన్నిధ్యం కోసం వెయ్యి కళ్ళతో ఎదురు చూసింది. సీతమ్మ ఆవేదనను విన్న శ్రీరామచంద్రుడు ఆమెను వెతుక్కుంటూ వెళ్ళాడు. పశ్చాత్తాపంతో చేసిన ప్రార్థనలు భగవంతుణ్ణి మన దగ్గరకు తీసుకువస్తాయి అనడానికి ఇదే నిదర్శనం.

మనం కూడా సీతమ్మలాగ **హరిణిని స్మరించి హరిని విస్మరిస్తే** దుఃఖాలను అనుభవించాల్సి వస్తుంది. తప్పులను తెలుసుకొన్న సీతమ్మ పశ్చాత్తాప హృదయంతో ఎలా భగవంతుని కోసం పరితపించిందో అలా మనం కూడా తపిస్తే ఆయన సన్నిధి తప్పక లభిస్తుంది. ❖

గోరుముద్ద

పతనానికి దారి 'పరనింద'

- స్వామి సుప్రియానంద

కబీరా నిందక్ నా మిలో పాపీ మిలో హజార్ ।
ఏక్ నిందక్‌కే మాథేపర్ లాఖ్ పాపిన్‌కో భార్ ॥

"కబీరా! వెయ్యి మంది పాపాత్ములు తారసపడినా సరే పరవాలేదు కానీ పరులను నిందించేవాడు మాత్రం ఒక్కడు కూడా ఎదురుపడకూడదు. ఎందుకంటే అతని తలమీద లక్షమంది పాపుల యొక్క భారం ఉంటుంది". పరులను నిందించటం మహాపాపమనీ, పరులను నిందించేవారికి ఆమడ దూరంలో ఉండాలనీ ఈ కబీర్ దోహా సూచిస్తుంది. పరులను నిందించటం మనకు ఎట్టి మేలు చేయకపోగా

కీడును కలిగిస్తుంది. మనస్సును భగవంతుడి నుండి మరల్చి కలుషితం చేస్తుంది. కలుషిత మనస్సు ఇతరులలోని తప్పులను మాత్రమే చూస్తుంది. ఇతరుల దోషాలు చర్చించే చోట ఉన్న అందరూ ఆ పాపంలో కొంతపాలు పంచుకోవలసి ఉంటుంది. ప్రత్యక్షంగా ఇతరులను నిందించనప్పటికీ వారిపై ఉన్న నిందారోపణలు వినటం, విని ఆనందించడం కూడా పతనానికి హేతువులు.

పరనింద పతనానికి ఎలా దారి తీస్తుందో శ్రీరామకృష్ణులు చెప్పిన ఈ భావగర్భితమైన కథలో చూద్దాం! "ఒక దేవాలయం సమీపంలో ఒక సన్న్యాసి నివసించేవాడు. ఎదురుగా ఒక వేశ్య ఇల్లు ఉంది. విటులు నిరంతరం ఆమె ఇంటికి వస్తూపోతూండడం చూసి, సన్న్యాసి ఒక రోజు ఆమెను పిలిచి, ఇలా చీవాట్లు పెట్టాడు: "నువ్వు మహాపాపివి. రేయింబవళ్ళు నువ్వు పాపాన్నే చేస్తున్నావు. నీ కెలాంటి దుర్దశ రాబోతుందో కదా!". పాపం ఆ వేశ్య తను చేసే పనులను తలుచుకొని తన పాపాలను క్షమించమని విశ్వాసంతో భగవంతుణ్ణి ప్రార్థించేది. పశ్చాత్తాప హృదయంతో తన జీవనాన్ని సాగించేది. ఇక సన్న్యాసి మాటకొస్తే ఆయన మనసంతా వేశ్య గురించిన ఆలోచనలే! ఆమెను నిందించడమే ఆయనకు ఒక దినచర్యగా మారింది. కొన్ని గులకరాళ్ళను పోగు చేసుకున్నాడు. ఆ వేశ్య ఇంట విటుడు ప్రవేశించినప్పుడల్లా ఒక గులకరాయిని తీసి గుర్తుగా ఒక చోట వేయసాగాడు. క్రమంగా ఆ రాళ్ళు ఒక పెద్దగుట్టగా తయారయ్యాయి. ఒకరోజు సన్న్యాసి వేశ్యకు ఆ గుట్టను చూపిస్తూ "చూశావా! ఇది నీ పాపాల గుట్ట. నీ కెలాంటి ఘోరదుర్గతి కలుగుతుందో తెలుసా!" అంటూ నిందించాడు. పాపం ఆ నిర్భాగ్యురాలు తన పాపరాశిని చూసి గజగజ వణికిపోతూ తన అశక్తతను గురించి భగవంతుడికి మొరపెట్టుకుంది. ఆమె ప్రార్థన భగవంతుడు ఆలకించాడు. ఆ రోజే వేశ్య మరణించింది. విధివశాన సన్న్యాసీ ఆరోజే దేహత్యాగం చేశాడు. యమదూతలు సన్న్యాసిని నరకానికి తీసుకెళ్తున్నారు. విష్ణుదూతలు వచ్చి ఆవేశ్యను వైకుంఠానికి గొనిపోయారు. అది చూసి సన్న్యాసి నివ్వెరపోయి ఇలా అరిచాడు "ఇదెక్కడి అన్యాయం, ఇదే కాబోలు భగవంతుడి ధర్మసూక్ష్మత?" ఈ మాటలు విని విష్ణుదూతలు ఇలా అన్నారు: "నువ్వు జీవితమంతా నీ హృదయంలో వేశ్య యొక్క పాపకార్యాలను మననం చేయడం, నిందించడంలోనే గడిపావు. తన శరీరం పాపం చేసినా ఆమె అహర్నిశలూ హృదయపూర్వకంగా భగవంతుణ్ణి ప్రార్థించింది. విధాత నిర్ణయమెప్పుడూ న్యాయంగానే ఉంటుంది." ❖

తనకు గల్గు పెక్కు తప్పులు నుండగా
ఓగు నేరములెంచు నొరులగాంచి
చక్కిలంబు గాంచి జంతిక నగినట్లు
విశ్వదాభిరామ వినురవేమ.

'చక్కిలాన్ని చూసి జంతిక నవ్వినట్లుగా దురాత్ముడు తనలోనే అనేక లోపాలు ఉంచుకొని, ఇతరుల తప్పులను లెక్కిస్తాడు'.

దాస్యభావంలో దివ్యానుభూతులు

-స్వామి జ్ఞానదానంద



దాస్యభావ సాధనను అనుష్ఠిస్తున్న కాలఘట్టంలో శ్రీరామకృష్ణులకు ఒక అపూర్వ దర్శనం కలిగింది. ఆ దివ్య దర్శనం ఆయన మనోఫలకం మీద గాఢంగా ముద్రించుకు పోయింది. ఆ సంఘటనను శ్రీరామకృష్ణులే స్వయంగా ఇలా వర్ణించారు: "ఒక రోజు నేను పంచవటి కింద కూర్చున్నాను. ఎనలేని కరుణ ఉట్టిపడుతున్న ఒక జ్యోతిర్మయమైన స్త్రీమూర్తి రూపం నా ముందు ప్రత్యక్షమైంది. చుట్టూ ఉన్న పరిసరాలు ఆమె తేజస్సుతో దేదీప్యమానంగా ప్రకాశించాయి. నాకు ఆమె స్పష్టంగా కనిపిస్తోంది. అదే సమయంలో పంచవటిలోని చెట్లు, మొక్కలు, గంగానది - సమస్తమూ కనిపిస్తున్నాయి. ఆమెను మానవ స్త్రీగానే భావించాను; ఎందుకంటే దేవతలకు ఉన్నట్లు మూడు కన్నులు గానీ, నాలుగు చేతులు గానీ ఏవీ లేవు. కానీ దేవతా స్త్రీలలో లేని విశిష్టత ఏదో ఆమెలో గోచరించింది. ఆమె వదనారవిందం నుంచి ప్రేమ, దయ, కరుణ, సహనం, విషాదం - ఇవన్నీ ఒక్కుమ్మడిగా వర్షిస్తున్నాయి. ఆ దివ్య స్త్రీ మూర్తి ప్రసన్నంగా చూస్తూ, నా వైపు నెమ్మదిగా అడుగులు వేస్తూ గంభీరంగా వస్తోంది. ఆమె రావడం చూసి పరమాశ్చర్యంలో మునిగిపోయాను. ఎవరీ దివ్యకాంత? అని అనుకుంటున్నంతలో హఠాత్తుగా ఒక కోతి అక్కడికి వచ్చి, ఆమె పాదాల మ్రోల వ్రాలింది. తక్షణమే నా అంతరంగంలో - ఈమె సీత, జీవితంలో చాలా దుఃఖాలు అనుభవించిన జనకుని ముద్దుల రాకుమారి, రాముని కోసమే జీవించిన సీతామాత అని స్ఫురించింది. వెంటనే 'అమ్మా, అమ్మా' అంటూ ఆమె పాదాల మీద పడబోయాను. కానీ మరుక్షణమే ఆమె మెరపుతీగలా వేగంగా వచ్చి దీన్లో (తమ దేహాన్ని చూపుతూ) ప్రవేశించి, లీనమైపోయింది. ఆశ్చర్యానందాలలో మునిగిపోయిన నేను బాహ్యస్మృతి కోల్పోయాను. ధ్యానం, భావపారవశ్యం లేకుండా పూర్తిగా మెలకువలో ఉన్నప్పుడు ప్రప్రథమంగా నాకు కలిగిన దివ్యదర్శనం ఇదే."

గురుదేవులకు సీతాదర్శనం పలుమార్లు కలిగింది. ఆయన జగజ్జననిని ఇలా ప్రార్థించారు: "అమ్మా! నేను సమస్తం మరచిపోయేలా చేసి నన్ను సీతలా మార్చివేయి. దేహం, కాళ్ళూ, చేతులూ, ఇంద్రియాలూ - వీటి స్ఫురణే ఆమెకు లేదు. కేవలం 'రాముడెక్కడ?' అనే చింతన ఒక్కటే!"

స్వామి రామకృష్ణానంద ఇలా వచించారు: "గురుదేవులు సీతాదేవి గురించి మాట్లాడినప్పుడు సాక్షాత్తు సీతమ్మ తల్లియే మాతో మాట్లాడుతున్నట్లుగా ఉండేది."

గురుదేవుల సునిశిత దృష్టి గురించి మాతృదేవి ఇలా వివరించారు: "గురుదేవులు పంచవటిలో సీతాదేవిని దర్శించారు. అప్పుడు ఆమె అత్యద్భుతమైన ఒక గాజును ధరించి ఉంది. ఆయన అచ్చం అలాంటిదే ఒక గాజును నాకు బహూకరించారు."

ఒకసారి స్వామి తురీయానంద, గురుదేవుల గురించి దిగ్భ్రాంతి కలిగించే కథనం ఒకటి స్వామి శారదానందకు చెప్పారు: ఒకరోజు మథుర్ అందమైన నాలుగు గుర్రాలు పూన్చిన బండిలో గురుదేవులను తోడ్కొని జాన్‌బజార్‌కు వస్తున్నాడు. బండి ఛిత్‌పూర్ వీథికి చేరినప్పుడు గురుదేవులకు ఒక అద్భుత దర్శనం కలిగింది. తాను సీతగా మారినట్లూ, రావణుడు తనను ఎత్తుకు పోతున్నట్లూ ఆయనకు అనిపించింది. ఈ భావోద్వేగంలో ఆయన సమాధి మగ్నులయ్యారు. అదే సమయంలో కళ్ళాలు సడలిపోగా, గుర్రాలు తడబడి కిందపడ్డాయి. ఆ దుర్ఘటనకు కారణమేమిటో మథుర్‌కు అర్థం కాలేదు. శ్రీరామకృష్ణులకు బాహ్యచైతన్యం కలగగానే మథుర్ ఈ దుర్ఘటన గురించి ఆయనకు తెలిపాడు. తాను భావపారవశ్యంలో ఉన్నప్పుడు రావణుడు తనను ఎత్తుకుపోతున్నట్లూ, జటాయువు రావణుని రథాన్ని ధ్వంసం చేయడానికి ప్రయత్నించినట్లూ తాను అనుభూతి చెందినట్లు అప్పుడు శ్రీరామకృష్ణులు చెప్పారు.

మనమంతా గురుదేవుల దాస్యభావంలోని ఈ దివ్యానుభూతులను నిరంతరం స్మరించి తరిద్దాం! ❖

అనుగ్రహించిన ఆదిపరాశక్తి

- శ్రీమతి గరిమెళ్ళ లక్ష్మి

భూలోకంలో సనాతన ధర్మం నశించిపోయింది. ప్రజలు యజ్ఞయాగాదులు చెయ్యడం, దేవతారాధన అనేవి పూర్తిగా మానేశారు. దేవతలందరూ ఈశ్వరుని దగ్గరకు వెళ్ళి ఆయన దగ్గర మొరపెట్టుకొన్నారు. అప్పుడాయన "నేను స్వయంగా భూమి మీద అవతరించి, యజ్ఞాలు మొదలైనవి చేయించి సనాతన సాంప్రదాయం నిలబడేలా చేస్తాను" అన్నారు.

ఆది శంకరుల వారు శ్రీనందన నామ సంవత్సరంలో పూర్ణానది ఒడ్డున కాలడి అనే గ్రామంలో శివగురువు ఆర్యాంబ దంపతుల ఇంట వైశాఖ శుద్ధ పంచమి నాడు జన్మించారు. అది ఒక దివ్యమైన రోజు.

ఒకరోజు తండ్రిగారు బాలుడితో "నాయనా! నేను రేపు ఉదయం ఒక పని మీద బయటకు వెళ్ళాలి. నువ్వు వేకువతోనే లేచి రోజూ నేను చేస్తున్నట్లుగా అమ్మవారి పూజ చెయ్యాలి. నేను సాయంకాలానికి తిరిగి వస్తాను" అన్నారు.



తండ్రి చెప్పిన ప్రకారం శంకరుడు ఉదయాన్నే లేచి స్నానం చేసి అమ్మవారి పూజకు ఉపక్రమించాడు. పూజ అయిన తరువాత అమ్మవారికి పాలు నివేదన చేసి జగదంబ రాక కోసం ఎదురుచూడసాగాడు. అయినా అమ్మవారు రాలేదు. చాలాసేపు నిరీక్షించి, "అమ్మా! వచ్చి పాలు తాగు" అన్నాడు గట్టిగా. అలా ఎన్ని మార్లు ఎంత గట్టిగా పిలిచినా అమ్మ పలకలేదు. ఎంత పిలిచినా అమ్మవారు రాకపోయేసరికి "అమ్మా! నువ్వు పాలు స్వీకరించలేదంటే మా నాన్నగారు నేను పూజ సక్రమంగా చెయ్యలేదని కోపగిస్తారు" అంటూ బాలుడు పీటకు తల బాదుకోవడం ప్రారంభించాడు; అప్పుడు అమ్మవారి పీఠం (కైలాసంలో) కదలసాగింది.

అమ్మ వారు ప్రత్యక్షమై పాలన్నీ తాగేసి, ఖాళీ చెంబు బాలుడికి ఇచ్చింది. "అమ్మా! నాకేవీ పాలు? మా నాన్నగారు రోజూ నువ్వు తాగాక, ఆ పాలు నా కిచ్చేవారు" అని ఏడుస్తూ అన్నాడు. వెంటనే జగన్మాత బాలునితో "ఊరుకో, ఏడవకు! నీకు చెంబు నిండా పాలు ఇస్తాలే" అని చెంబును స్తన్యంతో నింపి బాలుడికి ఇచ్చింది. ఆ పాలు తాగగానే బాలుడు దివ్య పారవశ్య స్థితికి చేరుకుని అనర్గళంగా అమ్మ వారిని స్తుతిస్తూ కీర్తించసాగాడు. జగన్మాత బాలుణ్ణి దీవించి అదృశ్యమైంది.

ఒకమారు శంకరుల వారు మానస సరోవర పరిక్రమణ చేసి, తరువాత సూక్ష్మశరీరంతో కైలాసంలో ఉన్న పార్వతీ పరమేశ్వరులను దర్శించారు. శంకరులను చూడగానే ఆదిపరాశక్తి అయిన పార్వతి ఆనందంతో వారిని తన ఒడిలోకి తీసుకుని వారి శరీరమంతా నిమిరింది. ఆది శంకరులు పసిబాలుడిలా అమ్మ పాదాల నుండి శిరస్సున ఉన్న కిరీటం వరకూ తడిమారు.

తరువాత మానవళి అంతా పారాయణ చేసి తరించడానికి వీలుగా పరమేశ్వరుని అనుగ్రహంతో సౌందర్యలహరిని తాళపత్రాల మీద శ్లోకరూపంలో వ్రాశారు.

పార్వతీ పరమేశ్వరుల అనుమతితో బయటకు రాగానే తన అనుమతి తీసుకోకుండా కైలాసానికి వెళ్ళినందుకు ఆది శంకరుల వార్ని కొమ్ములతో పొడిచింది నంది. వెంటనే ఆది శంకరుల వారు నందికి నమస్కరించి "నందీశ్వర నమస్తుభ్యం, శాంతానంద ప్రదాయకం..."అంటూ స్తోత్రించారు. "అయినా అమ్మవారి సౌందర్యాన్ని భూలోక వాసులకు తెలియ జెయ్యకూడదు" అంటూ కాళ్ళతో తన్నగా, తాళపత్రాలు కిందపడిపోయాయి. కిందపడిన శంకరులు లేస్తూ, కైలాసంలో పరమేశ్వరుడు ఇచ్చిన పంచలింగాలను జాగ్రత్తగా పట్టుకుని, కింద పడిన తాళపత్రాలను ఏరుతూ "అమ్మా" అని అరిచారు. అది విన్న పార్వతి వచ్చి వినాయకుడు, స్కందుడు లాగే ఈ శంకరుడు కూడా తన బిడ్డడే అని, శంకరుల బాల్యంలో జరిగిన సంఘటనను నందికి వివరించింది.

ఆదిశంకరుల వారు సూక్ష్మ దేహంలో కైలాసానికి వెళ్ళినప్పుడు పరమేశ్వరుడు తనకు ఇచ్చిన పంచలింగాలను ఐదు ప్రదేశాలలో ప్రతిష్ఠించారు-అవి: 1. బదరికాశ్రమంలో-ముక్తి లింగం 2. నీలకంఠ క్షేత్రంలో (నేపాల్) - వరలింగం 3.చిదంబర క్షేత్రంలో-మోక్షలింగం 4. శృంగగిరిలో-భోగలింగం 5. కాంచీపురంలో-యోగలింగం. ❖

ఏప్రిల్ 29న ఆదిశంకరాచార్య జయంతి

పరమేశ్వరుని పరిరక్షణలో ...

స్వామి జపానంద స్వీయ అనుభవాలు -22

(...గత సంచిక తరువాయి)

యాచకుని సేవలు యాదృచ్ఛికం !

సుగ్రీవుని రాజ్యమైన కిష్కింధను దర్శించాలని ఒకమారు స్వామి జపానంద వెళ్ళారు. అక్కడే శ్రీరామలక్ష్మణులు కొంత కాలం నివాసమున్నారు. అక్కడ నుంచే హనుమంతుడు సీతమ్మను వెతకడానికి వెళ్ళాడు. అక్కడ నుంచే వానరసేనను తీసుకుని శ్రీరాముడు రావణుడి మీద దండయాత్రకు బయల్దేరాడు. స్వామి అవన్నీ మననం చేసుకుంటూ పర్వతాల మధ్యలో ఉన్న ఆ అందమైన ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ ఉన్న పాత దేవాలయాన్ని చూడగానే రామాయణంలో కిష్కింధ కాండ అంతా ఒక చలనచిత్రంలా కళ్ళ ముందు కదలాడింది. రాత్రి కిష్కింధలో గడిపి ఉదయమే మాతంగ పర్వత దర్శనం చేసుకోడానికి వెళ్ళారు. అక్కడ అప్పుడే ఎవరో కొబ్బరికాయ కొట్టి వెళ్ళారు. ఆకలి వేస్తోంది. అనుకోకుండా కొబ్బరికాయ ప్రసాదం దొరకడంతో అది తీసుకుని తిన్నారు. అక్కడకు దగ్గరలోనే చక్ర తీర్థం ఉంది. అడవి మార్గంలో నుంచి మధ్యాహ్నానికి చక్రతీర్థం చేరుకున్నారు. అక్కడ నది కొండ చుట్టూ చక్రాకారంలో ప్రవహిస్తుంది. ఆ ప్రాంతం ఒకప్పటి విజయనగర సామ్రాజ్య రాజధాని అయిన హంపి. అక్కడ శ్రీ హంపీశ్వర మహాదేవుని విశాలమైన ఆలయం ఉంది. అది శైవుల ప్రసిద్ధ తీర్థ స్థలం. స్వామి జపానంద అక్కడ నదిలో స్నానం చేశాక తీరంలో ఒక బండ మీద కూర్చుని ప్రకృతి సౌందర్యాన్ని తిలకిస్తున్నారు. ఒక వృద్ధురాలు వచ్చి, ఒక కొబ్బరికాయ ఇచ్చి కన్నడ భాషలో ఏదో చెప్పింది. సన్న్యాసికి ఏమీ అర్థం కాలేదు. ఆమె సన్న్యాసికి నమస్కారం చేసి వెళ్ళిపోయింది. ఆ పూట కొబ్బరికాయ తిని కడుపు నింపుకొన్నారు. కొబ్బరి తినడంతో కడుపు నొప్పి వచ్చి, తరువాత జిగట విరేచనాలు మొదలయ్యాయి. ఇక చక్రతీర్థంలో ఉందామన్న ఆలోచన మానుకుని, హోస్పేట వేపు నడక సాగించారు. రాత్రికి హోస్పేట చేరుకున్నారు. విరేచనాల వల్ల విపరీతంగా నీరసం వచ్చి, అక్కడే ఉన్న లింగాయతుల సత్రంలో నిద్ర పోయారు. రాత్రంతా విరేచనాలు అవడంతో చాలా నీరసంగా ఉన్నారు. పొద్దుటికి రక్త విరేచనాలు కూడా మొదలయ్యాయి. లేస్తే కళ్ళు తిరుగుతున్నాయి. దాంతో, రోజంతా అలా పడుకునే గడిపారు.

సాయంకాలానికి ఒక యాచకుడు సారంగీ వాయించుకుంటూ అక్కడకు వచ్చాడు. స్వామి జపానందను చూసి ఆనందంగా రాత్రంతా ఆయనతో సత్సంగం చేయవచ్చనుకున్నాడు. కానీ రాత్రంతా సన్న్యాసి అలా బయలుకు వెళుతూ ఉండడం చూసి చింతిస్తూ, "ఈ అనారోగ్యం ఎప్పటి నుంచి ఉంది? మీరు ఇక్కడకి ఎప్పుడు వచ్చారు? మందు

తీసుకున్నారా? ఏమైనా తిన్నారా?" అంటూ ప్రశ్నలు వేశాడు. "రేపు ఉదయం నేను అన్నం వండి పెడతాను, తగ్గిపోతుంది" అన్నాడు.

ఉదయాన్నే ఆ యాచకుడు అన్నం వండి, ఎండు మిరపకాయలు నెయ్యి వేసి రసం చేసి, భోజనం వడ్డించాడు. ఆ మిరపకాయల రసం చూసి ఇదే ఆఖరి భోజనం ఈ జీవితానికి అనుకుని భగవంతుడికి నమస్కారం చేసి చారు అన్నం తిన్నారు. యాచకుడు కూడా కొంత అన్నం తిని భిక్షకు వెళ్ళిపోయాడు. మొదట కొంచెం బాధ ఉన్నా సాయంత్రం అయ్యేసరికి విరేచనాలు తగ్గి వంట్లో కాస్త శక్తి వచ్చింది. స్వామి పరిస్థితి చెప్పి యాచకుడు ఒక ఇంటి నుంచి నెయ్యి, పెరుగు అడిగి తీసుకొచ్చాడు. రాత్రి మళ్ళీ అన్నం వండి, రసం చేసి, పెరుగు వేసి భోజనం పెట్టాడు. మర్నాటికి పూర్తిగా స్వస్థత వచ్చింది. ఆ రోజు కూడా యాచకుడు సన్న్యాసికి పెరుగు అన్నం పెట్టి భిక్షకు వెళ్ళిపోయాడు. రోజంతా స్వామి విశ్రాంతి తీసుకున్నారు. సాయంత్రం యాచకుడు ఒక భక్తుణ్ణి తీసుకుని వచ్చాడు. అతను సన్న్యాసికి బళ్ళారికి రైలు టికెట్టు కొని ఇచ్చి, బళ్ళారి వెళ్ళమని చెప్పాడు. యాచకుడు, సన్న్యాసిని స్టేషన్ దగ్గర దిగబెట్టి రైలు వచ్చేవరకూ ఉండి సెలవు తీసుకున్నాడు. యాచకుడి సేవకు సన్న్యాసి కృతజ్ఞత తెలుపుకొన్నారు. ❖

(మిగతా వచ్చే సంచికలో...)

అనువాదం : శ్రీమతి జి.ఎస్. లక్ష్మి

దేవీ వైభవం

ప్రవచనం: **శ్రీ సామవేదం షణ్ముఖశర్మ** విలేఖనం: **శ్రీమతి ఎన్. శేష**

(...గత సంచిక తరువాయి)

భగవంతుని రూపాలు మన లాంటివి కావు. అవి "సర్వేనిత్యాః శాశ్వతాశ్చ దేహాస్తస్య పరాత్పరః హానోపాధాన రహితాః నైవ ప్రకృతి జా క్వచిత్" – అని పురాణాలు చెబుతున్నాయి. అవి శాశ్వతములు, నిత్యములైనటువంటివి, ఏ కారణం చేత అంటే – నైవ ప్రకృతి జాః = అవి ప్రకృతిజములు కావు. జ్ఞానమాత్రాశ్చ కేవలాః= అవి జ్ఞానంతో కూడినటువంటివి. అవి చిదానందమయమైన విగ్రహములు. ఇది స్థూలంగా మనం ధ్యానించగానే మనకు స్ఫురించిన స్వరూపం. అరుణాం కరుణా తరంగితాక్షీం ధృత పాశాంకుశ... అనగానే సామాన్యులకు కూడా స్ఫురించే స్వరూపం అది; ఇది స్థూల రూపం. ఆ తరువాత చెప్పబడేది సూక్ష్మరూపం, అది మంత్ర స్వరూపం.

అమ్మ యొక్క పంచదశి మంత్రమే మనం చూస్తున్న ఆ స్వరూపంలో ఉంది. ఆ స్వరూపంలో శిరస్సు నుండి కంఠం వరకూ వాగ్భవకూటం, కంఠం నుండి కటి వరకూ కామరాజకూటం, ఆ తరువాత శక్తికూటం–ఇది అమ్మ యొక్క మంత్ర స్వరూపం. అటు తరువాత సూక్ష్మతరమైన కుండలినీ స్వరూపం. ఆ తరువాత పరమార్థమైన తత్త్వ స్వరూపం. ఈ పరమార్థ తత్త్వ స్వరూపమే నిః శబ్దాలుగా చెప్పబడుతుంది. ఒక్కసారి అమ్మను తలచుకోగానే ఈ నాలుగూ స్ఫురించాలి మనకి. అప్పుడే మనం పూర్ణంగా అమ్మను అర్థం చేసుకున్న వాళ్ళమవుతాం. ఈ నాలుగు విధాలైన సౌందర్యలహరుల్ని ప్రవహింపచేసినదే లలితా సహస్రం. దాన్ని సంభావన చేస్తూ సౌందర్య లహరి శ్లోకాలు మనకు అందచేశారు.

త్రిపురసుందరి అనే నామానికి అనేక అర్థాలున్నాయి. త్రిపురముల యందు వ్యాపించిన సుందరి అని ఒక అర్థం. త్రయమయమైన ఈ జగత్తు అంతటికీ పూరణమై ఉన్న సుందరి. అని మరొక అర్థం. త్రిపురసుందరి అంటే త్రిపురుని సుందరి – ఇది మంత్ర శాస్త్రం ప్రకారం చెబుతున్న అర్థం. త్రిపురుడు అంటే శివుడు. శివుడు అనగానే ముగ్గురిలో ఒకడు కాదు, ముగ్గురూ ఒక్కడైన వాడు. మనం ఉపాసన చేసే శివుడు కానీ, శక్తి కానీ ముగ్గురిలో ఒక్కరు కాదు, ముగ్గురూ ఒక్కరైన వారు. అందుకు త్రిపురుడు అంటే బ్రహ్మ, విష్ణు, రుద్రాత్మకుడైన పరమశివుడు అని అర్థం. ఆయన యొక్క సుందరి కనుక త్రిపురసుందరి. మరొక అంతరార్థంలో అమ్మవారు శ్రీచక్ర స్వరూపిణి, శ్రీవిద్యకి అధిష్ఠాన దేవత. శ్రీచక్రం మొత్తం మూడు మండలాలతో భాసిస్తూ ఉంటుంది. శంకర భగవత్పాదుల వారు "ఏడాంక అనల భాను మండల రసత్ శ్రీ చక్ర మధ్య స్థితాం" అన్నారు. ఇదే సౌందర్యలహరిలో "తపన శశి వైశ్వానరమయీం తటిల్లేఖా తన్వీం..." అన్నారు. తపన = సూర్యుడు, శశి= చంద్రుడు, వైశ్వానర=అగ్ని–ఈ మూడు మండలాలూ శ్రీచక్రంలో ఉంటాయట. ఈ మూడు మండలాల యందూ ఎవరు వ్యాపించి ఉన్నారో ఆ చైతన్యమే అమ్మవారు అన్నారు. శ్రీచక్రంలో వ్యాపించిన చైతన్యం, మూడు మండలాల యందు వ్యాపించిన చైతన్యం – రెండూ ఒకటే అని తెలుస్తోంది. మూడు మండలాలలో వ్యాపించిన చైతన్యం పరమాత్మ చైతన్యం. దీనికి సమాధానం భగవద్గీతలో దొరుకుతుంది. గీతలో కృష్ణపరమాత్మ తానేమిటో తన తేజస్సేమిటో చక్కగా చెప్పాడు. కృష్ణ పరమాత్మ ఎవరో

అమ్మ కూడా అదే, అయ్యది కూడా అదే తత్త్వం – పరమాత్మ తత్త్వం. అక్కడ చెప్పినదే ఇక్కడ అన్వయించుకుంటే స్పష్టమవుతుంది.

యదాదిత్యగతం తేజో జగద్భాసయతేఽఖిలం।
యచ్చంద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధి మామకమ్ ॥ (గీత 15:12)

"ఏ తేజస్సు సూర్యుని యందు, చంద్రుని యందు, అగ్ని యందు భాసిస్తూ ఉన్నదో ఆ తేజస్సు నాది" అన్నాడు శ్రీకృష్ణుడు. ఈ మూడు రకాలైన తేజస్సులే మన ప్రపంచానికి అవసరమైనవి. సూర్య చంద్ర అగ్నులు తప్ప మరొక తేజస్సు లేదు. సూర్యుని నుండి వచ్చే ఆ ప్రాణశక్తి అంతా ఆ కిరణాల యందు ఉంది. ఆయనలో ఉన్న ఆర్ద్రత అనే రసత్వశక్తి చంద్రుని ద్వారా మనకు లభిస్తుంది. సూర్యుని యందున్న ప్రకాశ లక్షణం ఉష్ణతా లక్షణం అగ్ని ద్వారా మనకు లభ్యమవుతుంది. అందుకు సూర్యుడు, అగ్ని, చంద్రము అనే మూడింటికి మూలం నేను అని అన్నారాయన. ఆ నేను అనే పరతత్త్వం ఇక్కడ అమ్మగా మనకు చెప్పబడుతున్నది. అందుకు భగవత్ గీత ప్రతిపాదించిన పరమతత్త్వమే శ్రీచక్రము నందు కూడా... "ఏడాంకానల భానుమండల రసత్ శ్రీచక్ర మధ్య స్థితాం" అని చెప్పబడింది. అలాగే మన శరీరంలో ఉన్న ఈ మూడు రకాల తేజస్సులే మనలో ముఖ్యమైన మూడు నాడులకు అధిష్ఠానాలుగా ఉన్నవి. అవే ఇడా, పింగళ, సుషుమ్నా నాడులు. అందుకు మనలో ఉన్న ముఖ్య నాడీ త్రయానికీ జగత్తులో ఉన్న తేజస్త్రయానికీ ఏది మూల చైతన్యమో ఆ మూల చైతన్యమైన ఆత్మ చైతన్యమే అమ్మ అని ఇక్కడ స్పష్టమవుతోంది. త్రిపురసుందరి అంటే ఇలా కూడా మనం అర్థం చెప్పుకోవచ్చు. ఇలా శ్రీచక్రానికీ, విశ్వకారణమైన తేజశ్చక్రానికీ సమన్వయం లభిస్తుంది.

అమ్మ గురించి చెప్పేటప్పుడు వశిన్యాది వాగ్దేవతలు అనేక చోట్ల అమ్మకూ, అయ్యకూ ఉన్న సామరస్యాన్ని చెబుతూ వచ్చారు. అమ్మ వారికి అలా చెబితేనే ఇష్టమట. శివునితో కలిపి చెబితేనే అమ్మకు ఇష్టం, శివుణ్ణి వదిలి అమ్మ గురించి చెబితే అమ్మ వినదట. ఎందుకంటే – "సదాశివ పతివ్రతా సదాశివ కుటుంబినీ" అన్నారు. పాతివ్రత్య ధర్మము, ఏకపత్నీ వ్రతము అనేది వారిద్దరి దగ్గరే చెల్లింది. శివపార్వతులు అన్యోన్య దంపతులు, వారు ఉభయులూ జగతికి తల్లితండ్రులై బోధించిన పరమ ధర్మం అది. సృష్టి అంతా ఆ ధర్మాన్ని అనుసరిస్తేనే తరిస్తున్నది. ఇక్కడ అనేక చోట్ల ఆ స్వారస్యం వశిన్యాది వాగ్దేవతలు మనకు చూపిస్తుంటారు. "కామేశ బద్ధమాంగల్య సూత్ర శోభిత కంధరా" అనీ, "సదాశివ పతివ్రతా" అనీ, "కామేశ జ్ఞాత సౌభాగ్య మార్థవోరుద్వయాన్వితా" ... ఇవన్నీ కూడా అమ్మవారి పాతివ్రత్య వైభవాన్నీ, శివశక్తుల అన్యోన్యతనీ తెలియజేస్తున్న నామాలు. శివప్రియా, శివపరా, శిష్టేష్టా, శిష్టపూజితా... ఇలా అడుగడుగునా అమ్మకీ అయ్యకీ ఉన్న అన్యోన్య అనుబంధాన్ని ప్రస్తావిస్తుంటారు.

శంకర భగవత్ పాదుల వారు కూడా చమత్కారంగా సౌందర్యలహరిని "శివశ్శక్త్యాయుక్తో యది భవతి శక్తః ప్రభవితుమ్..." అని ప్రారంభించారు. కావ్యం ఎప్పుడైనా మంగళ శబ్దంతో ప్రారంభమవాలి. శివ అంటేనే మంగళం; అందుకే 'శివః' అనే శబ్దంతో ప్రారంభించారు. అమ్మ వారికి స్తోత్రం చెయ్యాలని ఆయన సిద్ధపడ్డారు. అయితే అమ్మవారికి స్తోత్రం చేస్తే అమ్మ అంత ఏకాగ్రంగా వినరట. ముందు అమ్మవారి దృష్టిని తనవైపు తిప్పుకోవడానికి 'శివః' అన్నారట. అనగానే ఆవిడ వెంటనే తిరిగిందట; అప్పుడు స్తోత్రమంతా చేశారు. "శివః" అంటే ఆవిడ వెంటనే వింటుందట. శివుడంటే అంత ఇష్టం. ❖ సశేషం

భ్రమలు విడనాడండి!

సర్వజీవులలోనూ వాస్తవ తత్త్వమైన చైతన్యం సర్వదా ఒక్కటిగానే ఉంది; ఏ క్షణంలోనూ అనేకత్వానికి తావే లేదు. కానీ కేవలం భిన్న భిన్న ఉపాధులతో భిన్న భిన్న విధాలుగా తనను తాను సందర్శించుకుంటోంది ఆ చైతన్యం. "ఇతడు తండ్రి, ఇతడు కుమారుడు, ఇతడు మిత్రుడు, వీరంతా తదితరులు"... ఇత్యాది వ్యవహారమంతా కేవలం ఉపాధికి సంబంధించినదే. స్వయంకృతమైన మనఃకల్పితమే! బంగారం సర్వదా ఒక్కటే అయినా, "ఉంగరం - గాజులు- కంకణం" లాంటి ఆకృతులలో భిన్నమైనట్లు కనపడుతోంది కదా! చైతన్యం సర్వదా ఒక్కటే! అది అద్వితీయం! అయినప్పటికీ వేరు వేరు స్థావర జంగమ శరీరాలను ధరించి, భిన్నము, ఖండము అయినట్లు ఒకానొక విచిత్రమైన భ్రమానుభవం తనకు తానుగా కల్పించుకుంటోంది. ఈ శరీరాలకు ఉపాదానకారణం పంచభూతాలు కదా! పంచభూతాల ఉత్పన్నము, రకరకాలైన సమ్మేళనాలు, నానాత్వపు అనుభవం, జ్ఞాన అజ్ఞానాలు, ఇవన్నీ నీటిలోని తరంగాల లాగ ఏర్పడుతున్నాయి. "కెరటము - నిశ్చలంగా ఉండే నీరు" లాగ చింత నిశ్చింతలు అనిత్య సత్య చిద్వస్తువులో స్వప్న సదృశంగా ఏర్పడుతున్నాయి. "శుద్ధ - నిత్య- అనంత" స్వభావం కలిగి ఉన్న ఆ చిద్వస్తువు, "నేను జన్మిస్తున్నాను, మరణిస్తున్నాను" లాంటి భ్రాంతులన్నీ పొందుతోంది. స్వప్నంలో "కాలుజారి పడడం' మిథ్యే అయినా ఆ స్వప్న సమయంలో సత్యంలాగే తోస్తోంది కదా! "నేను - నాది" మొదలైన భ్రాంతులతో కూడిన ఈ చిత్తము..... మిథ్య అయిన ఈ జనన మరణాలను అనుభవిస్తోంది.

ఓ రామచంద్రా! ఇలా జగత్తుగా కనపడేదంతా 'మనోవికారం' మాత్రమే సుమా! ఉల్లాసంతో కూడిన మనోతరంగాలు మననరూపం ధరించి, ఆత్మ కన్నా వేరుగా ప్రవర్తించడమే ఈ సంసార చమత్కారం. అయితే, మనస్సు ఒకానొకప్పుడు ఉద్బోధింపబడినదై, ''స్వసత్త''లో లయించిపోతోంది. అంటే అది స్వరూప స్వభావాల దృష్ట్యా 'ఆత్మే' అవుతోంది.

''చిత్'' అనే నీటితో కూడిన ''బ్రహ్మసాగరం''లో కనబడుతున్న అనేక జీవులు సుడుల లాంటివారు. ఈ దృశ్యంలో పాల్గొంటున్న చిత్తం దానిలోని కెరటం లాంటిది. ఇక్కడ చమత్కారమేమిటంటే... "పరిశీలించి చూడడం జరిగితే, ఏదైతే స్వతహాగా గానీ, లేదా ఉత్తమమైన వాస్తవదృష్టి చేత గానీ లేదో, అలాంటిదే ఇదంతా! అయితే ఇదంతా కూడా "నిర్దుష్టమైన సత్యమా?" అన్నట్లుగా ఉంది. అలాంటి రూపం గల అనుభవాన్నే "మాయ" అంటున్నాం.

మరి ఈ మాయ తొలగేది ఎట్లా?

పరబ్రహ్మాన్ని గ్రహించడమే ఈ మాయను ఛేదించే ఉపాయం. పరబ్రహ్మ సమక్షం అచింత్యము, మహాశక్తియుతం కూడా! అలాంటి శుద్ధ పరబ్రహ్మలో 'మాయ' యొక్క విజృంభణం స్వాభావికంగానే ఒక చెట్టు నీడలా ఏర్పడుతోంది. అలాంటి విజృంభణమే ఒక వైపు జీవుని (లేక ద్రష్ట) రూపంగాను, మరొకవైపు జగత్తు (లేక దృశ్యము) రూపంగాను ఒకే సమయంలో ప్రకటితమవుతోంది.

వాస్తవానికి జ్ఞానుల దృష్టికి జీవుడు, సంకల్పాత్మకమైన మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం, మాయ - ఇవన్నీ చిత్తం యొక్క వివిధ నామాలు గానే తోస్తాయి. అంతటికీ కారణం మనస్సే. మనస్సే స్వయంగా తనలో శబ్ద - స్పర్శ - రూప - రస - గంధాలనే పంచ తన్మాత్రలను కల్పించుకొని 'మిథ్య' అయిన జగత్తును నిజంలా విస్తరింపజేస్తోంది. మనస్సు యొక్క ఈ జగద్దర్శనం ఒకడు తన స్వప్నంలో ఆయా వస్తువులను చూడడం వంటిది. నిజానికి శుద్ధము - నిత్యము అయిన ఆత్మ సర్వదా శాంతభావంతో ఉంటుంది. పరమార్థ దృష్టితో చూస్తే... అది దేనినీ చూడడమే లేదు. అయినా కూడా, వ్యావహారికంగా చూస్తే ఈ ఆత్మ 'చిత్తం' అనే స్వభావాన్ని ఆశ్రయించి, తత్ఫలితంగా భ్రమను అనుభవిస్తోంది.ఒకే ఆత్మ చైతన్యం చిత్తాన్ని ఆశ్రయించడం వల్ల వివిధ రూపాలుగా గోచరిస్తుంది. ❖

('శ్రీవసిష్ఠ రామ సంవాదం' ఉత్పత్తి ప్రకరణం ఉత్తరార్థం నుంచి) **అనువాదం : వై. హెచ్. రామకృష్ణ**

మనోభావాలెన్నో మతాలన్ని!

ప్రపంచమంతా ఒకే మతాన్ని అవలంబించడాన్ని భగవంతుడు కూడా అంగీకరించడు. ఎందుకంటే ఒకరి ముఖం వేరొకరి ముఖాన్ని పోలనట్లుగా, ఒకరి స్వభావం వేరొకరి స్వభావాన్ని పోలి ఉండదు. కాబట్టి ఎవరికి అనుకూలమైన మార్గంలో వారు వెళ్ళేందుకు తోడ్పడాలి. ఒక నది ఒకానొక దిశగా పారుతోంది. నీవు దాని ప్రవాహాన్ని మార్చి, వేరొక సరళమార్గంలో ప్రవేశపెడితే అది ఎక్కువ వేగంతో ప్రవహిస్తుంది. దాని శక్తి ఎక్కువవుతుంది. కానీ దాన్ని సరళమార్గం నుంచి పూర్తిగా మార్చేయాలని ప్రయత్నిస్తే దాని ఫలితం ఏమవుతుందో చూడు! నీరు తగ్గిపోతుంది. దాని బలం క్షీణిస్తుంది. కాబట్టి ఎవరి సంస్కారం ఎలా ప్రేరణ చేస్తే, అలా ఆ మార్గంలో వారిని నడపాలి. భారతదేశంలో మతవైరం లేదు. ప్రతి మతానికీ స్వాతంత్ర్యం ఈయబడింది. కాబట్టే మతం సజీవమై నిలచింది. ఒక్క మతమే సత్యమనీ, తన మతాన్ని విశ్వసించని వాడు మూర్ఖుడనీ, ఇతరులు కపటులు అనీ, కపటి కాకపోతే తన మతాన్నే అవలంబించేవాడనీ, భావించడం వల్లనే, మత విషయకంగా పోరాటాలు కలుగుతున్నాయనీ జ్ఞాపకం ఉంచుకోవాలి.

ప్రజలందరూ ఒకే మతాన్ని అవలంబించాలనేది భగవదిచ్ఛ అయితే, ఇన్ని మతాలు ఎందుకు పుట్టుకొచ్చాయి? ప్రతి ఒక్కరినీ ఒకే మతం అనుసరించాల్సిందిగా బలవంతపెట్టడానికి అనేకులు ఇదివరకే వ్యర్థప్రయత్నాలు చేశారు. కత్తి ఎత్తి ప్రజలందరినీ ఒకే మతంలోకి చేర్చాలని ప్రయత్నించినప్పుడు కూడా దాని స్థానంలో పది మతాలు పుట్టుకొని వచ్చాయని చరిత్రే సాక్ష్యం చెబుతోంది.

ఒకే మతం అందరికీ సరిపడదు. నరుడు క్రియ, ప్రతిక్రియలనే రెండు శక్తుల సమ్మేళనంతో ఏర్పడు తున్నాడు. ఈ శక్తులు అతనిని జిజ్ఞాసువుగా చేస్తున్నాయి. అలాంటి శక్తులు, మానవుని మనస్సుకు వ్యాయామం కల్పించకపోతే, అతడు జిజ్ఞాస చేయడానికి, అంటే ఊహించడానికి అశక్తుడైపోతాడు. 'మానవుడు' అంటే మననం చేసేవాడని అర్థం. మనుష్యః అంటే మనసు కలవాడని అర్థం. అట్టి మనిషికి మననశక్తి, జిజ్ఞాసశక్తి, లేక ఊహాశక్తి నష్టమైపోయిన తక్షణమే, అతడు పశుసమానుడైపోతాడు. అలా కావాలని ఎవరు కోరుకొంటారు? అలాంటి దుర్దశ భారతదేశ ప్రజలకు వాటిల్లకుండా, భగవంతుడు రక్షించాలి!.

మనిషిగా నిలపడానికి ఏకత్వంలో భిన్నత్వం ఉండడం అవసరం. ప్రతి విషయంలోనూ భిన్నత్వాన్ని అంటే వైవిధ్యాన్ని పోషించాలి. భిన్నత్వం ఉండేంతవరకే ఈ ప్రపంచం నిలువ గలదు. ఒకటి చిన్నదిగా, ఇంకొకటి పెద్దదిగా ఉండడం మాత్రమే భిన్నత్వమని భావించరాదు. ఈ జీవితంలో అన్నీ తమ తమ స్థితిలో సమంగా స్వధర్మాన్ని నిర్వహిస్తే భిన్నత్వం సురక్షితంగానే ఉంటుంది. ప్రతి మతంలోనూ యోగ్యులు, సమర్థులు ఉండి, తమ మతాన్ని గౌరవభాజనం చేస్తున్నారు. ప్రతి మతంలోనూ, అలాంటి వారుంటారు. కాబట్టి, ఏ సంప్రదాయం పట్లా ద్వేషమనేది ఉండరాదు. ❖

పరిప్రశ్న

- స్వామి సుకృతానంద

జి.కె.రావు, కాకినాడ

? : వాలి సుగ్రీవుల పోరులో సర్వజ్ఞుడైన రాముడు సుగ్రీవుని మెడలో దండ ఎందుకు వేయవలసి వచ్చింది?

✍: శ్రీరామచంద్రుడు లీలామానుష రూపుడు. తన దివ్యత్వాన్నీ, సర్వజ్ఞత్వాన్నీ, సర్వశ్రేష్ఠత్వాన్నీ, సర్వశక్తిమత్వాన్నీ, అనంతత్వాన్నీ, సకల కల్యాణగుణాల్నీ మరచి మానవునిగా నటించాడు. వైదేహి అగ్నిప్రవేశ సమయంలో బ్రహ్మదేవుడు వచ్చి, "సీత మహాలక్ష్మి, నువ్వు విష్ణుమూర్తివి" అంటే, "నేను మానవుడినే అనుకుంటున్నాను" అంటాడు రామయ్య. దీన్నే లీల అంటారు. భగవంతుడు నిత్యుడై, పంచభూతాత్మకమైన శరీరంలో ప్రవేశించి, జీవునిగా నటిస్తూ లోకకల్యాణం చేస్తాడు. రామబ్రహ్మ, సీతమ్మ చేత అగ్ని ప్రవేశం చేయించాడు. సీతామాత పాతివ్రత్యాన్ని సకల లోకాలకూ నిరూపించడానికే ఆమెను అగ్నిప్రవేశం చేయించానని తానే చెబుతాడు.

"ప్రత్యయార్థం తు లోకానాం
త్రయాణాం సత్య సంశ్రయః
ఉపేక్షా చాపి వైదేహీం ప్రవిశంతీం హుతాశనమ్.
విశుద్ధా త్రిషు లోకేషు మైథిలీ జనకాత్మజా,
న హి హాతుమయం శక్యా కీర్తిరాత్మవతా యథా."

"నేను సత్య పరాధీనుడనై ముల్లోకాలకూ విశ్వాసం కలిగించడం కోసం అగ్నిలో ప్రవేశించే సీతను ఉపేక్షించాను. జనక పుత్రిక అయిన ఈ సీత ముల్లోకాలలోనూ పవిత్రురాలు. ఆత్మాభిమానం కలవాడు కీర్తిని విడువలేనట్లు నేనీమెను విడిచి ఉండజాలను" అన్నాడు రామయ్య. ఇంతకన్నా నిదర్శనం ఇంకేం కావాలి! 'శ్రీరామకృష్ణ పరమహంస' సప్రామాణిక జీవిత గాథ స్వామి శారదానందులవారిచే విరచితమైంది. అందులో పరమాత్మ మానవరూపంలో అవతరించి, దైవ మానవ శక్తులతో వ్యవహరించిన విధం చదవండి. అప్పుడు శ్రీరాముని అవతారలీల అర్థమవుతుంది.

సాయి రామానందస్వామి, గిద్దలూరు

? : ఆత్మ, మనస్సు ఒక్కటేనా? తప్పక సమాధానం చెబుతారని ఆశిస్తున్నాను.

✍: మనస్సు అంటే ఆలోచనల పుట్ట. సంకల్ప వికల్పాత్మకం. దూరం నుంచి చూసిన ఒక వస్తువు- మనిషా? కొయ్యా? జంతువా? ఇలా చూసే వస్తువు అది అవునా, కాదా అని నిర్ణయం చేయ ప్రయత్నించేది సందిగ్ధావస్థ. శోకమోహాల ద్వారా మనస్సుకు బాధ కలుగుతుంది. మనోనాశమే మోక్షం అంటారు. అది సూక్ష్మశరీరంలో భాగం.

ఆత్మ నిత్య శుద్ధ బుద్ధ ముక్తమైనది. ఆనంద స్వరూపం. స్వప్రకాశం. ఆత్మను తెలుసుకోవాలి. ఆత్మజ్ఞాని అయితే పరమానందాన్ని పొందుతాడు. 'ఆత్మావారే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యః' అని వేదమాత ఘోషిస్తోంది. ఆత్మ నిత్యం, శాశ్వతం. మనస్సు అనిత్యం. మనస్సు 'మసి' అయితేనే ఆత్మలాభం కలుగుతుంది.

ఎమ్.ఎల్.ఎన్. రావు, హైదరాబాదు

? : పితృదేవతలు ఎవరు? ఎక్కడుంటారు? ఎంతకాలం వరకు వీరికి కర్మలు ఆచరించాలి?

✍: బ్రహ్మకుమారుడైన మను ప్రజాపతికి సప్త ఋషులు జన్మించారు. వారు పితృదేవతలను సృష్టించారు. వీరే కాక విరాట్ పురుషుడు, బ్రహ్మదేవుడూ పితృదేవతల్ని ఏర్పరచారు. బ్రహ్మ సంభవుడు రూపాలు గల మూడురకాల దేవతల్నీ, తేజస్సు గల నాలుగు రకాల పితృదేవతల్నీ సృష్టించాడు. మానవులు తర్పణం ద్వారా సమర్పించే పిండాలు వారికి చేరుతాయి. పిండ ప్రదానం ద్వారా వారి ఋణం తీర్చుకోవాలి. అలా చేయని వారికి పాపం వస్తుంది – 'అకరణే ప్రత్యవాయః' అని శాస్త్రం చెబుతోంది. మనిషి తన శరీరాన్ని నిత్యం అన్న పానీయాలతో పోషించినట్లు సంవత్సరానికొకసారి పిండప్రదానం ద్వారా పితృదేవతలను శ్రద్ధా భక్తులతో పూజించాలి. ❖

- రెంటాల జయదేవ

(...గత సంచిక తరువాయి)

అతి ముఖ్యమైన ఆ ఎనిమిది పుష్పాలు

అష్ట విధ పుష్పాలు

భగవంతుణ్ణి ఎనిమిది రకాలైన పుష్పాలతో అర్చించాలని పెద్దల మాట. ఆ అష్టవిధ పుష్పాల గురించి ప్రతీకాత్మకంగా చెప్పారు. దీని గురించి ఓ పురాణ కథ ఉంది. శ్రీస్కాంద మహాపురాణంలోని రేవాఖండంలో 51వ అధ్యాయంలో ఇలా ఉంది:

నర్మదా తీరంలో అమరకంటకమనే ఓ పర్వతం ఉంది. అక్కడే నర్మదలో శూలభేద తీర్థం ఉంది. ఆ తీర్థం దగ్గర అమర కంటక పర్వతం మీద ఓ గుహ ఉంది. ఆ గుహలో శ్రీమార్కండేయ మహర్షి వెయ్యి దివ్య సంవత్సరాలు తపస్సు చేశాడు. ఒక శివలింగాన్ని కూడా అక్కడ ప్రతిష్ఠించాడు. ఆ స్వామికి మార్కండేయుడని పేరు.

ఆ లింగమూర్తికి అష్టవిధ పుష్పాలతోనూ, అష్టవిధ మానసిక పుష్పాలతోనూ పూజ చేయాలి. ఆ అష్టవిధ పుష్పాలు-

వారిజం సౌమ్య మాగ్నేయం
వాయవ్యం పార్థివం పునః ।
వానస్పత్యం భవేత్ షష్ఠం
ప్రాజాపత్యం తు సప్తమమ్ ॥ 31
అష్టమం శివపుష్పం స్యా
త్తేషాం శృణు వినిర్ణయమ్ । 31 1/2

పైన చెప్పిన వారిజం, సౌమ్యం మొదలైన అష్టవిధ పుష్పాల వివరణ ఏమిటయ్యా అంటే -

వారిజం సలిలం జ్ఞేయం
సౌమ్యం మధు ఘృతం పయః 32
ఆగ్నేయం ధూపదీపాద్యం
వాయవ్యం చందనాదికమ్
పార్థివం కందమూలాద్యం
వానస్పత్యం ఫలాత్మకమ్ 33
ప్రాజాపత్యం తు పాఠాద్యం
శివపుష్పం తు వాసనా 33 1/2

'వారిజం, సౌమ్యం, ఆగ్నేయం, వాయవ్యం, పార్థివం, వానస్పత్యం, ప్రాజాపత్యం, శివపుష్పం - అని పుష్పాలు ఎనిమిది విధాలు. వివరంగా చెప్పాలీ అంటే -

1. 'వారిజ' పుష్ప సమర్పణమంటే దేవుడికి అభిషేకం చేయడం.
2. 'సౌమ్య' పుష్ప సమర్పణమంటే భగవంతుడికి తేనె, నెయ్యి, పాలు నివేదించడం.
3. 'ఆగ్నేయ' పుష్ప సమర్పణమంటే దేవుడికి ధూప, దీపాలు సమర్పించడం.
4. 'వాయవ్య' పుష్పపూజ అంటే చందనం మొదలైనవి దేవుడికి అలదడం.
5. 'పార్థివ' పుష్పార్చనమంటే కందమూలాదుల్ని నైవేద్యంగా పెట్టడం.
6. 'వానస్పత్య' పుష్పోపహారమంటే దేవుడికి ఫలాదుల్ని సమర్పించడం.
7. 'ప్రాజాపత్య' పుష్ప సమర్పణమంటే దేవుడి ఎదుట వేద పురాణాదుల్ని చదివి, వినిపించడం.
8. 'శివ పుష్ప' సమర్పణమంటే భక్తుడు తన మనో వాసనల్ని సమర్పించడం.

మానసిక పుష్పాలు

భగవత్ భక్తులు మొదట ఇలా పత్రాలు, పుష్పాలతో పూజిస్తారు. ఇవన్నీ పూజలో ప్రథమ సోపానాలు. అయితే, సాధనా క్రమంలో ముందుకు వెళ్ళాక, ఆత్మ వికాసం పొందిన తరువాత, సర్వాంతర్యామి అయిన ఆ దేవదేవుణ్ణి మనఃపుష్పాలతోనే పూజించవచ్చు.

మానసికంగా కూడా ఎనిమిది పుష్పాలుంటాయి. అవి - 1.అహింసా పుష్పం 2. ఇంద్రియ నిగ్రహ పుష్పం 3. దయా పుష్పం 4. క్షమా పుష్పం 5. ధ్యాన పుష్పం 6. తపః పుష్పం 7. జ్ఞాన పుష్పం 8. సత్య పుష్పం. ❖

(అష్ట మానసిక పుష్పాల వివరణ వచ్చే సంచికలో...)

రామరాజ్యంలో ధర్మస్థాపన

కథ : స్వామి జ్ఞానదానంద
చిత్రాలు : దాకోజు శివప్రసాద్


ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా.... గత పద్నాలుగేళ్ళలో ప్రజలు పన్నులు సరిగా చెల్లించనందున కోశాగారం ఖాళీ అయింది. అందుకు ప్రతిగా ప్రతి ఒక్కరూ ఒక గుమ్మడి కాయంత బంగారాన్ని ఖజానాకు చెల్లించాలని శ్రీరాముని ఆజ్ఞ! హో...
హనుమా! నీవు అదృశ్యంగా ఉండి ప్రజలు దీని గురించి ఏమనుకుంటున్నారో తెలుసుకోవాలి! దీని వల్ల ఎవరికీ కష్టం కలగకూడదు సుమా!
అవును ప్రభూ మీకు ఎలాంటి అపకీర్తీ రాకూడదు.
రాముడు నిజంగా ధర్మప్రభువు. ఏనుగంత బంగారాన్ని కట్టాల్సిన మనం గుమ్మడి కాయంత ఇస్తే సరిపోతుందట!
అవును నిజం! కొండంత పాపం చేసి ఒక కొబ్బరికాయ కొట్టినట్లుంది!
ప్రజలంతా తమపై అధిక పన్ను భారం పడనందుకు సంతోషంగా ఉన్నారు.
కానీ దీని వల్ల నిజాయతీ పరులెవ్వరికీ నష్టం కలగకూడదని ధర్మదేవతను ప్రార్థిద్దాం!
ఆలయంలో వారిద్దరూ ధ్యానం చేస్తుండగా ధర్మదేవత దర్శనమిచ్చింది.
ధర్మహాని కలగకుండా చూడాలనే మీ తపనకు మెచ్చాను. ఈ కార్యాన్ని నేనే దగ్గరుండి నడిపిస్తాను.

మిగతా 36వ పేజీలో...

పరిత్యాగంతో పరిపూర్ణత

– స్వామి రంగనాథానంద

ఆత్మను ఎలా సాక్షాత్కరించుకోవాలి? మనం మన నిజ స్వరూపాన్ని మరచిపోయాం. ఈ సంసార వ్యూహంలో మనకు దారి కనపడడం లేదు. దారి చూపేదెవరు? మనమే! మనస్సు పరిశుద్ధమైన కొద్దీ అది మన అదుపులోకి వస్తుంది. శుద్ధమై, సుశిక్షితమైన మనస్సు భగవంతుణ్ణి చేరే దారిని కనుక్కొనగలదు. శ్రీరామకృష్ణులు ఇలా అంటారు: 'తిండికి ప్రలోభపడి బోనులో దూరుతుంది ఎలుక. కానీ, అందులో చిక్కుకొని, బయటపడాలని వృథా ప్రయాస పడుతుంది. అది ఏ మార్గం ద్వారా ప్రవేశించిందో అది తెరిచే ఉన్నా, ఆ సంగతి గ్రహించదు. అలాగే మోక్షమార్గం తెరిచే ఉంది. కానీ చాలా కొద్ది మంది మాత్రమే దాన్ని చేరగలరు'. తొలిదశలో మార్గదర్శనం అవసరం. భారతీయ మహర్షుల సుశిక్షితాలైన మనస్సులలో ఆత్మజ్ఞానోదయమైంది. ఆ బలాన్నిచ్చే ఈ సంప్రదాయాన్ని వారు తోటిమానవుల పట్ల గల అనురాగం కారణంగా, భావితరాలకు తరగని ఆస్తిగా దత్తం చేశారు.

ఉపనిషత్తులు స్ఫూర్తిదాయకాలుగా ఉండడంలోని రహస్యమిదే. మనిషి ఎల్లప్పుడూ వెదకుతున్న అంతరాత్మ నిగూఢ రహస్యాల సమాచారాన్ని అవి అతడికి అందజేస్తాయి.

మనిషి జిజ్ఞాసువు కావాలని ఉపనిషత్తులు ఆదేశిస్తున్నాయి. జిజ్ఞాసువుకు ప్రశ్నించే బుద్ధి అవసరం. ఉపనిషత్తులు మానవునికి సత్యాన్వేషణలో తోడ్పడతాయి. కావలసినది శ్రద్ధ. సత్యమార్గంలో సంశయాలు కూడదు. భగవంతుణ్ణి గురించి, సత్యాన్ని గురించి తీరిగ్గా సవాళ్ళు వేయకూడదు. ఈ ధోరణి వల్ల ఉపనిషత్తుల గంభీర తాత్పర్యం విశదం కాదు. మజ్జిగలో వెన్న ఉన్నప్పటికీ, చిలికితేనే అది పైకి తేలుతుంది. జిజ్ఞాస, ధ్యానాలనే కవ్వాలతో చిలికితేనే అనుభూతిలో దాగి ఉన్న సత్యం, పైకి తేలుతుందని ఉపనిషద్వాక్యం.

ఉపనిషత్తులను రహస్యాలుగా పరిగణించేవారు. ఉపనిషత్తులను రహస్య శాస్త్రమని అనడంలో కొంత అర్థం కూడా ఉంది. అవి చాలా గంభీరమైనవి. వాటిని శ్రద్ధానిష్ఠలతో చదవడానికి సిద్ధంగా ఉన్నవారే వాటి నుంచి ప్రయోజనం పొందగలుగుతారు.

ఈశావాస్య మిదగ్ం సర్వం యత్కించ జగత్యాం జగత్।
తేనత్యక్తేన భుంజీథా మా గృధః కస్య స్విద్ధనం ॥

'క్షణభంగురమైన ఈ జగత్తులో నశ్వరమైనదంతా ఈశ్వరునితో ఆవరింపబడి ఉంది. త్యాగాన్ని ఆలంబన చేసుకొని జీవించు. పరుల ధనాన్ని ఆశించకు'అని ఈశావాస్యోపనిషత్తు చెబుతోంది.

ఈ జగమంతా ఈశ్వరచైతన్యంతో నిండి ఉంది. ఈ విషయ ప్రపంచంలో మన అనుభవంలోకి వచ్చే నానాత్వాన్ని శాశ్వతమైన ఈ వెలుగులో చూడాలి. నీటి బుడగ క్షణంలో మాయమవుతుంది. అది ఏమిటి, ఎక్కడ నుంచి వచ్చింది, ఎక్కడకు పోయింది? నీటి నుంచి వచ్చింది, తిరిగి నీటిలో కలసిపోయింది. మధ్యలో నీటి బుడగగా కనపడినప్పుడూ అది నీరే! ఆ క్షణికమైన నీటి బుడగ నిజస్వరూపం నీరు. అలాగే, జగత్తు నిజస్వరూపం బ్రహ్మం. ఈ సంగతి గ్రహించు. విషయానుభవపు అలలో చిక్కుకొని, దీన్ని విస్మరించకు అంటున్నది ఈ మంత్రం. జీవితపు ప్రతి దశలోనూ మార్పు ఉంటుంది, మరణం ఉంటుంది. జీవితసౌధాన్ని నేర్పుతో కట్టడానికి ఇక్కడ స్థిరమైన పునాది లేదు. కాబట్టి లోతుగా లోనికి చూడమంటోంది ఈ ఉపనిషత్తు. అప్పుడు మృత్యువులో అమరత్వాన్నీ, నశ్వరంలో నిత్యాన్నీ, నానాత్వంలో ఏకత్వాన్నీ చూడగలం. ఇది ఉపనిషత్తుల మహాసందేశం.

'అనిత్య వస్తువుల నడుమ ఉన్న నిత్యుణ్ణి' చూడగలిగితే, ప్రతి వస్తువునూ ఈశ్వరుడు ఆవరించి ఉన్నాడని తెలుసుకొంటే, విశ్వం యొక్క నిజస్వరూపం మనకు

అవగతమవుతుంది. దాని తర్వాత అనత్తును పరిత్యజించాలి. ఈ లోకంలో సుఖాన్ని అనుభవించాలంటే, త్యాగం చేసి అనుభవించు! మనకి లోకంలో ఆలంబన మిచ్చేది త్యజించిన విషయం కాదు, మనం పట్టుకొని అనుభవించగలిగినదే మనకు ఆసరా. భగవంతుణ్ణి పట్టుకొని ఈ లోకాన్ని అనుభవించాల్సిందిగా ఈ మంత్రం చెబుతోంది. ఈ లోకాన్ని అనుభవించడానికి ముందు, భోగపద్ధతి తెలిసి ఉండాలి. దీన్ని భగవద్గీతలో విపులంగా చెప్పారు. ఈశోపనిషత్తు మొదటి మంత్రం దీనిని సంక్షిప్తంగా, త్యాగం అని ఒక ముక్కలో తేల్చింది.

నీతిశాస్త్రంలోనూ, ఆధ్యాత్మికతలోనూ కూడా త్యాగమే నిత్య సూక్తి. మన దైనందిన జీవితంలోనూ, ఇతరులతో గల సంబంధ వ్యవహారాలలోనూ, బలవంతంగా అనుభవించడం కన్నా వద్దనడమే పరమానంద దాయకం. ఈ మహాసత్యానికి వివరణ ఈ మంత్రంలో ఉంది. త్యాగవైరాగ్యాల వల్ల సర్వాంతరాత్మ అయిన పరబ్రహ్మతో తాదాత్మ్యం చెందుతాం. మనస్సు, దృష్టి పరిశుద్ధమైనప్పుడు విశ్వమంతా బ్రహ్మమయంగా తోస్తుంది. కనుక త్యాగమంటే నిరాకరణ మాత్రం కాదు! నిరాకరణ ధ్రువీకరణకు దారి తీస్తుంది. జీవపరిణామ తత్త్వవాదంలా ఉన్న జీవన తత్త్వవాదం కూడా ఒక క్రమపద్ధతిలో నిరాకరణ నుంచి ధ్రువీకరణకు సాగుతుంది. ఈ గతిలో ధ్రువీకరణాంశాలే నైతిక, ఆధ్యాత్మిక జీవితకాలంలో నిజమైన సంతోషాన్ని ఇస్తాయి.

చివరకు, ఈశోపనిషత్తులోని మొదటి మంత్రం, 'మా గృధః కస్య స్విద్ధనం' – పరుల ధనం కోసం ఆశపడరాదు అంటుంది. పైకి సరళంగా తోచినా, ఇందులో ఎన్నో నైతిక ఆధ్యాత్మిక విలువలు ఇమిడి ఉన్నాయి. ప్రతీ గురువూ చెప్పేది ఇదే! నువ్వు నీతీ నిజాయతీలతో ఆర్జించినదే నీ సొత్తు. దానితోనే జీవితాన్ని అనుభవించు. పరుల సొమ్ముకు ఆశపడకు. శంకరాచార్యులు భజగోవింద స్తోత్రంలో ఇలా అంటారు:

మూఢ జహీహి ధనాగమ తృష్ణాం కురు సద్బుద్ధిం మనసి వితృష్ణామ్!
యల్లభసే నిజ కర్మోపాత్తం విత్తం తేన వినోదయ చిత్తమ్!!

"ఓమూఢుడా! ధనం పై అత్యాశ వలదు; సద్బుద్ధి కలిగి, విరక్తిని పెంచుకో; నీతీ నిజాయతీలతో సంపాదించిన, దానితోనే నీ చిత్తాన్ని రమింపజేయి". ఇప్పుడు మనస్సులో ఈ ప్రశ్న లేస్తుంది: ధనం చెడు చేస్తుంది. మనమందరం యాచకులం కావాలా? కాదంటున్నారు శంకరులు! నీ మనస్సును ధర్మానికి కట్టి ఉంచి, విరక్తిని అలవరచుకో అంటున్నారు. నీది కాని దానిపై, నీవు ఆర్జించని దానిపై మనస్సును నిలువనీయకు. నీతి నిజాయతీలతో ఆర్జించిన భోగాలను ఉల్లాసంగా అనుభవించు. లోభం వలదు, లోభి సర్వాన్నీ స్వప్రయోజనానికి వాడుకుంటాడు. ఈ విధంగా దోపిడీ చేసినవారి జీవితాలు, చేయబడిన వారి జీవితాలు నైతికంగా, ఆధ్యాత్మికంగా దెబ్బ తింటాయి. జీవిత ధ్యేయాలైన నైతిక ఆధ్యాత్మిక స్వభావాన్ని అభివృద్ధి చేసుకోవడానికి స్వలాభాపేక్ష ఉండకూడదు. నిరాకరణ ద్వారానే నిజమైన ఆనందం దొరుకుతుందని గుర్తు ఉంచుకొని, అహంకృతినీ దాని ఔపాధిక గుణాలనూ నిరాకరించాలి. బ్రహ్మమొక్కటే సత్యమని ధ్రువపరచుకొని, ధనాన్ని అంకిత భావంతో ఉపయోగించాలి. స్వలాభాపేక్ష, స్వార్థాలను పూర్తిగా విడనాడితేనే జీవితాన్ని నిజంగా అనుభవించగలం. ఈ ప్రపంచమంతా ఆనందస్వరూపమైన బ్రహ్మంతో నిండి ఉంది, దానిని అనుభవించడానికే మనమిక్కడ ఉన్నది. త్యాగభావంతో మన దృష్టి పరిశుద్ధమైనప్పుడే, ఈ ప్రపంచం బ్రహ్మానంద తరంగాలతో నిండి ఉన్నదనీ, అదే దాని నిజస్వరూపమనీ కనుగొంటాం. ఇదే అభివృద్ధి, ఇదే వికాసం, ఇదే సాక్షాత్కారం, ఇదే పరిపూర్ణత, ఇదే జీవపరిణామక్రమపు అంతిమ గమ్యం. ❖

(స్వామి రంగనాథానందజీ ఉపన్యాసాల నుంచి)

సేకరణ : ఆర్. కృష్ణ

ఇదిగో భద్రాద్రీ.. గౌతమి అదిగో చూడండి...

శ్రీరామచంద్రుడు సీతాలక్ష్మణ సమేతంగా వనవాసం కోసం దండకారణ్యానికి వెళ్ళి, అక్కడ తిరుగుతూ ఒక శిలమీద విశ్రమించాడు. అప్పుడు ఆ శిలను "మరుసటి జన్మలో నీవు నా భక్తుడిగా ప్రసిద్ధి చెందుతావు" అని ఆశీర్వదించాడు.

భువిపై వైకుంఠం 'భద్రాద్రి' : పూర్వం మేరువు అనే పర్వత రాజు తన భార్య మేరుదేవితో కలసి సంతానం కోసం బ్రహ్మనుగురించి ఘోరతపస్సు చేశాడు. సర్వలోక పితామహుడైన బ్రహ్మ వారి తపస్సుకు మెచ్చి ప్రత్యక్షమై వారి కోరిక ఏమిటో చెప్పమన్నాడు. పర్వత రాజు పుత్ర సంతానం కావాలని అడిగాడు. కాలక్రమంలో వారికి నీలుడు, భద్రుడు అనే కవలలు కలిగారు; వారిద్దరూ పెరిగి పెద్దయ్యాక గొప్ప విష్ణు భక్తులయ్యారు. తండ్రి ఆదేశం మేరకు భద్రుడు శ్రీరాముడి అనుగ్రహం కోసం గోదావరీ నది ఒడ్డునా, నీలుడు శ్రీకృష్ణుడి అనుగ్రహం కోసం పూరీలోనూ తపస్సు ప్రారంభించారు. భద్రుని తపస్సుకు మెచ్చి సీతాలక్ష్మణ సమేతుడైన శ్రీరామచంద్రమూర్తి భద్రుడి ఎదుట ప్రత్యక్షమయ్యాడు. శ్రీరామచంద్రుని దివ్యమంగళ రూపాన్ని గాంచి ఆనందాశ్రువులతో భద్రుడు శ్రీరామునికి సాష్టాంగ ప్రణామం చేశాడు. అప్పుడు శ్రీరాముడు ప్రసన్నుడై అమిత కరుణతో భద్రుణ్ణి ఒక వరం కోరుకోమన్నాడు. భద్రుడు సీతా లక్ష్మణులతో సహా అదే రూపంతో తన శిరస్సు మీద నివసించాల్సిందిగా వేడుకున్నాడు. శ్రీరాముడు ఈ నేల, నీరు, నిప్పు, గాలి, నింగి ఉన్నంతకాలం తాను భద్రుడి శిరస్సు పైన నివశించి ఉంటాననీ, కల్పాంతంలో అతనికి తన (శ్రీరాముడి) సాయుజ్యం లభిస్తుందనీ చెప్పి భద్రునికి దర్శనమిచ్చిన రూపంతో ఊర్ధ్వ కరములలో శంఖచక్రాలను ధరించి, అధఃకరములలో ధనుర్బాణాలను ధరించి వామాంకాన సీతతో, చెంత సౌమిత్రితో భద్రుని శిరస్సుపైన స్థిరంగా నిలచిపోయాడు. ఈ భూతలంపై వెలసిన ఆ వైకుంఠమే మన రాష్ట్రంలోని 'భద్రాచల క్షేత్రం'.

గౌతమ ముని కుమార్తె గౌతమి : శివపురాణంలోని కోటి రుద్రసంహితలో గౌతమీ నది ఆవిర్భావ వృత్తాంతం ఇలా వర్ణించబడింది: ఒకసారి గౌతమ మహర్షి తన శిష్యులను చెరువు నుంచి నీళ్ళు తీసుకురమ్మని పంపించాడు. అదే సమయంలో అక్కడకు కొందరు ఋషిపత్నులు కూడా నీళ్ళ కోసం వచ్చారు.

సీతమ్మవారి పాదముద్రలు



పచ్చల పతకం

కానీ తమ కంటే గౌతముని శిష్యులు ముందుగా నీళ్ళు తీసుకు వెళ్ళడాన్ని వారు సహించలేకపోయారు. ఆ ముని భార్యలు ఆశ్రమాలకు వెళ్ళి గౌతమ ముని శిష్యులు వారిని అవమాన పరిచినట్లుగా లేనిపోనివి కల్పించి తమ తమ భర్తలకు ఫిర్యాదు చేశారు. వెంటనే మునులంతా కోపోద్రిక్తులై, గౌతముడిని శాప గ్రస్థుణ్ణి చేయమని విఘ్నేశ్వరుణ్ణి ప్రార్థించారు. గౌతముడు ఉత్తముడని విఘ్నేశ్వరుడు వారికి ఎంత నచ్చచెప్పినా వారు వినలేదు. చివరికి చేసేది ఏమీలేక విఘ్నేశ్వరుడు వారి కోరికను నెరవేర్చడానికి అంగీకరించాడు. ఒకరోజు గౌతమముని ఆశ్రమంలోకి ఒక ఆవు ప్రవేశించి అక్కడి మొక్కలను తినడం ప్రారంభించింది. వెంటనే గౌతమముని కర్రతో ఆవుని కొట్టడంతో ఆవు మరణించింది. ఈ వార్త తెలిసిన వెంటనే మిగిలిన ఋషులంతా గౌతముణ్ణి, అహల్యను అపహాస్యం చేయడం ప్రారంభించారు. గౌతమునికి గోహత్యా పాతకం సంప్రాప్తించిందని చెప్పి వారిని అక్కడ నుండి బహిష్కరించారు. గౌతముడు గోహత్యా పాతకం నుండి విముక్తుడు కావాలని పరమేశ్వరుని గురించి తపస్సు చేయగా, పరమేశ్వరుడు ప్రత్యక్షమయ్యాడు. గౌతముడు తనను గోహత్యా పాతకం నుంచి విముక్తుణ్ణి చేయమని శివుణ్ణి ప్రార్థించాడు. అప్పుడు తన జటాజూటం నుంచి శివుడు గంగను వదలగా గంగాదేవి అంశ బాలిక రూపంలో ప్రత్యక్షమైంది. శివుని ఆజ్ఞ మేరకు గంగాదేవి గౌతముణ్ణి పావనం చేసి ఇక నేను వచ్చిన పని పూర్తి అయింది కాబట్టి తిరిగి నన్ను స్వీకరించమని శివుణ్ణి ప్రార్థించింది. అప్పుడు శివుడు 'ఓ దేవీ! నువ్వు ఈ భువిపై ఉండి రాబోయే యుగాల్లో ఎంతోమందిని పవిత్రుల్ని చేయాల్సి ఉంది'అని గంగాదేవి కర్తవ్యాన్ని బోధించాడు. గౌతముని తపస్సుచే శివుని జటాజూటం నుండి ఆవిర్భవించిన గంగాదేవియే గౌతమీ(గౌతముని కుమార్తె) నదిగా పిలవబడుతోంది. అరణ్యవాస కాలంలో శ్రీసీతారామ లక్ష్మణులు గౌతమీ నదిని దాటి పంచవటికి చేరారని ప్రతీతి.

దమ్మక్కకు దశరథ రాముని దర్శనం : 17వ శతాబ్ది ప్రారంభంలో భద్రాచలం దగ్గర ఉన్న భద్రిరెడ్డిపాలెం అనే గ్రామంలో పోకల దమ్మక్క అనే మహాభక్తురాలు ఉండేది. ఆమె ఎప్పుడూ శ్రీరామ నామపారాయణం చేసేది. ఒకమారు శ్రీరాముడు ఆమెకి కలలో కనిపించి "నేను భద్రగిరిపై ఉన్నాను, నన్ను అర్చించు, కొద్ది రోజులలో ఒక భక్తుడు వచ్చి నా ఆలయ గోపుర ప్రాకారాదులు నిర్మిస్తాడు" అని చెప్పాడు. తరువాత ఆమె భద్రగిరి వెళ్ళి అక్కడ వెతకగా దైవ విగ్రహాలు కనపడ్డాయి. అప్పటి నుండీ వాటికి ఆమె రోజూ పూజ చేసి తాటిపండు ఒకటి నైవేద్యంగా పెట్టేది. స్థానికుల సహాయంతో చిన్న మండపం నిర్మించి, ప్రతీ ఏడూ సీతారాముల కల్యాణం చేయించేది.

గోపన్నను రక్షించిన రామన్న: భద్రాచల రాముని ఆలయాన్ని క్రీ.శ. 1614లో భక్తరామదాసుగా ప్రసిద్ధికెక్కిన కంచెర్లగోపన్న నిర్మించాడు. గోల్కొండ నవాబు తానీషా దగ్గర పాలవంచ పరగణాకి తహశీల్దార్‌గా పనిచేసేవాడు గోపన్న. ఒకమారు పాలవంచ గ్రామస్థులు భద్రాచలంలో జరుగుతున్న జాతర చూడటానికి వెళ్తుంటే, వారితో గోపన్న కూడా వెళ్ళాడు. అక్కడ సీతారాముల అద్భుతమైన విగ్రహాలను చూశాక, అక్కడ ఒక ఆలయం నిర్మించాలనే ఆలోచన వచ్చింది. గ్రామస్థులని విరాళాలడిగి ఆలయ నిర్మాణం ప్రారంభించాడు, అయితే ఆ పైకం సరిపోలేదు. గ్రామస్థులు, పాలవంచ పరగణాలో వసూలైన సొమ్మును దేవాలయం నిర్మించడానికి వాడమనీ, తమకు పంటలు పండగానే తిరిగి పైకం చెల్లిస్తామనీ దానిని తానీషాకు ఈయవచ్చుననీ సలహా ఇవ్వడంతో వసూలైన ఆరులక్షలతో దేవాలయ నిర్మాణం పూర్తిచేసి, సీతారామలక్ష్మణులకు అనేక ఆభరణాలను కూడా చేయించాడు.

అయితే సర్కారు వారి సొమ్ము వారి అనుమతి లేకుండా ఆలయ నిర్మాణానికి వాడినందుకు గోపన్నకి 12 సంవత్సరాలు కఠిన కారాగారశిక్ష విధించారు. శిక్షాసమయంలో బాధలకి ఓర్వలేక రాముణ్ణి స్తుతిస్తూ ఎన్నో కీర్తనలు పాడాడు. అవన్నీ 'భక్తరామదాసు కీర్తనలు'గా ప్రసిద్ధి చెందాయి.

చివరికి రామలక్ష్మణులు మారువేషాలలో ఒక అర్ధరాత్రి వేళ నవాబుని లేపి, ఆరు లక్షల మొహిరీలు చెల్లించి, రామదాసుని విడిపించమని చెప్పి రశీదు తీసుకున్నారు. ఆ రశీదు రామదాసు దిండు కింద ఉంచి అదృశ్యమయ్యారు. మర్నాడు ఉదయం నవాబు రాత్రి తనకి పైకం చెల్లించినది రామలక్ష్మణులే అని

గ్రహించి, రామదాసుని విడిపించి, ఆ పైకాన్ని అతనికి ఇచ్చాడు. అయితే రామదాసు ఆ పైకం తీసుకోలేదు. కానీ భగవంతుడిచ్చిన పైకంలోంచి గుర్తుగా రెండు మొహర్లు తీసుకున్నాడు. ఆ రెండు మొహర్లూ ఇప్పటికీ భద్రాద్రి రాములవారి దేవస్థానంలో భద్రపరచబడి ఉన్నాయి. ఆనాడు రామదాసు చేయించిన మంగళసూత్రాలు, చింతాకు పతకము, పచ్చల పతకము, బంగారు బిళ్ళల

మొలత్రాడు, రత్నకిరీటము, వజ్రాల పోగులు, కలికితురాయి మొదలైన ఆభరణాలన్నీ ఆలయంలోని వస్తుప్రదర్శనశాలలో యాత్రికులు చూడడానికి ఏర్పాటు చేశారు. సీతాదేవికి రామదాసు చేయించిన ఆభరణాల్ని ఇప్పటికీ అమ్మవారికి శ్రీరామనవమి రోజున అలంకరిస్తూంటారు.

పంచవటిలో పర్ణశాల : వనవాస కాలంలో సీతారాములు నివసించిన ప్రదేశం ఇది. ఇది భద్రాచలానికి 35 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడే సీతాపహరణం జరిగింది. పర్ణశాలలో ఇప్పటికీ శ్రీరాముని పాదముద్రలు, సీతాదేవిని భూమితోసహా పెకిలించుకుపోయిన గుర్తులు ఉన్నాయి. ఇక్కడ దగ్గర్లోనే సీతావాగు అనే సెలయేరు ఉంది. అందులోనే సీతారాములు నిత్యం స్నానం చేసేవారని చెప్తారు. స్నానానంతరం సీతమ్మవారు కుంకుమ పసుపు ధరించిన గుర్తుగా అక్కడ పసుపు కుంకుమల రంగులలోని శిలలను చూడవచ్చు. అక్కడి శిలలపై సీతమ్మవారు నార చీరలను ఆరవేసిన గుర్తులుంటాయి.

పక్షిరాజుని ముక్తిధామం: ఎటపాక భద్రాచలానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. శ్రీరామభక్తుడైన జటాయువు సీతను అపహరించుకుపోతున్న రావణాసురునితో పోరాడి తన రెక్కలను కోల్పోయాడు. జటాయువు శ్రీరాముడి దర్శనమయ్యే వరకూ కొన ఊపిరితో ఉండి, శ్రీరాముడికి సీతాపహరణ విషయాన్ని చెప్పి ప్రాణాలు విడిచాడు. అప్పుడు ఆ పక్షిరాజుకి శ్రీరాముడు ఇక్కడే ఉత్తర క్రియలు జరిపాడు. జటాయువుకి ముక్తి నిచ్చిన ఈ స్థలాన్ని 'జటపాక' అంటారు. అది క్రమంగా ఎటపాకగా మారింది.

శ్రీరాముడు ఖరదూషణాది 14000 మంది రాక్షసులను సంహరించిన ప్రదేశం 'దుమ్ముగూడెం' (ఇది రాక్షసుల అస్తికలు ఉన్న ప్రదేశం కాబట్టి ఈ ప్రాంతానికి దుమ్ముగూడెం అని పేరు వచ్చింది), శ్రీరాముడు మాతంగ మునితో యోగశాస్త్రాలను చర్చించిన ప్రాంతం 'శ్రీరామగిరి' – ఇలా శ్రీ సీతారాముల అరణ్యవాస ఘట్టాలను స్ఫురణకు తెచ్చే దర్శనీయ స్థలాలు ఎన్నో భద్రాద్రి సమీపంలో ఉన్నాయి. భక్తులు **'భువిపై వైకుంఠం – భద్రాద్రి'ని** దర్శించి తరించెదరుగాక! ❖

ప్రార్థనలోని అసలు రహస్యం

అక్బర్ చక్రవర్తి ఒకసారి వేటాడడానికి అడవికి వెళ్ళాడు. సాయంకాలపు ప్రార్థన సమయం కావడంతో అడవిలోనే మోకాళ్ళ మీద కూర్చొని, నమాజ్ చెయ్యడం మొదలు పెట్టాడు.

"పొద్దున్న అనగా అడవికి వెళ్ళిన తన భర్త ఇంకా ఇంటికి తిరిగి రాలేదే" అన్న కంగారులో ఒక మహిళ తన భర్తను వెతుక్కుంటూ అటుగా వెళుతోంది. ఆ రైతు భార్య కంగారులో అక్కడ ఉన్న చక్రవర్తినీ, ఆయన పరివారాన్నీ చూడలేదు. సరిగ్గా చక్రవర్తి నమాజ్ చేస్తున్న దగ్గరకు రాగానే ఆమె తొట్రుపడి, కింద పడి లేచి గబగబా వెళ్ళిపోయింది. ప్రార్థన చేసుకుంటున్న చక్రవర్తికి ఇదంతా చిరాకనిపించింది. అయినా దైవప్రార్థన చేస్తూ మాట్లాడకూడదు కనుక తిరిగి కన్నులు మూసి ప్రార్థనలో నిమగ్నమయ్యాడు.

తన భర్తను అడవిలో కలిసి, ఆ సంతోషంలో రైతు భార్య భర్తతో కలసి తిరిగి వచ్చే సమయానికి చక్రవర్తి చేస్తున్న ప్రార్థన ముగిసింది. చక్రవర్తి ప్రార్థన ముగిసే సమయానికి రైతు, అతని భార్య అక్కడకు చేరారు. అప్పుడే చక్రవర్తినీ, ఆయన పరివారాన్నీ చూసిన రైతు భార్య భయపడింది.

అక్బర్ చక్రవర్తి కోపంగా "నేను చక్రవర్తిని అనే భయం, గౌరవం లేకుండా, నా ప్రార్థనకు భంగం కలిగించావు. క్షమాపణ కూడా చెప్పకుండా వెళ్ళిపోయావు. ఎంత అహంకారం నీకు? దీనికి సరైన సంజాయిషీ ఇవ్వకపోతే నీకు శిక్ష విధిస్తాం" అన్నాడు. అప్పుడు రైతు భార్య ధైర్యంగా, "అయ్యా! నేను నా భర్తను వెతుకుతూ, ఆ కంగారులో మిమ్మల్ని చూడలేదు. ఆ సమయంలో నా మనస్సులో నా భర్తను వెతకడం తప్ప మరో ఆలోచనే లేదు. అయితే మీరు దైవం మీద మనస్సు ఉంచి ప్రార్థన చేస్తున్నారు. భగవంతుడు, నా భర్త కన్నా చాలా గొప్పవాడు కదా! అయినా మీరు నన్ను ఎలా గమనించగలిగారు?" అని ప్రశ్నించింది.

అది విన్న చక్రవర్తి నోట మాట రాలేదు! తరువాత అక్బర్ చక్రవర్తి "ఇవాళ ఒక రైతు భార్య నాకు ప్రార్థనలోని రహస్యాన్ని చెప్పకనే చెప్పింది" అన్నాడు తన పరివారంతో. ❖

– శ్రీమతి రాజీ రఘునాథన్

నరహరి గురుభక్తి

"మీ కుమారునిది అద్భుతమైన జాతకం. ఇతనికి మహారాజయోగం, ఆధ్యాత్మిక గురువు అయ్యే యోగం రెండూ ఉన్నాయి"అని జ్యోతిష్కుడు చెప్పగా తండ్రి తల్లివైపు చూసి చిరునవ్వు నవ్వాడు. ఆమె తన బిడ్డవైపు చూసింది, పిల్లవాడు నవ్వు ముఖంతో తల్లిని చూస్తున్నాడు.

తన గురువు కొద్ది రోజులలో అక్కడ నుంచి వెళ్ళిపోతున్నారని ఆరోజు నరహరి చాలా దిగులుగా ఉన్నాడు. నరహరి తన గురువుతో "గురువర్యా! నేనూ మీతో పాటే వస్తాను. నాకు మీ పాదసేవ చేసుకునే భాగ్యం కలగజేయండి" అని అన్నాడు. "నరహరీ! నాకు ఒక కోరిక ఉంది. దాన్ని నెరవేరిస్తే నా సేవ చేసినట్టే" అని గురువు నరహరితో చెప్పాడు. సంతోషంగా గురువుతో "నేను తప్పక మీ కోరికను నెరవేరుస్తాను. అదేమిటో చెప్పండి" అని నరహరి అడిగాడు. "నరహరీ! పూర్వం ఋషులు పూజించిన సీతారాముల విగ్రహాలు రాజుగారి దగ్గర ఉన్నాయి. వాటిని నేను ప్రతిష్ఠించాలి. నువ్వు రాజు దగ్గర నుంచి వాటిని తేవాలి. ఇదే నా కోరిక" అని నరహరితో గురువు చెప్పాడు.

గురువు కోరిక విన్న నరహరి మౌనంగా ఉండిపోయాడు. "నరహరీ! నువ్వు మధన పడకు. భగవంతుణ్ణి ప్రార్థిస్తే అతడే దారి చూపుతాడు. నా మాటలు నమ్ము" అని గురువు నరహరితో అన్నాడు. "గురుదేవా! భగవంతుని కృప, గురువు అనుగ్రహం ఉంటే ఎదైనా సాధించవచ్చు" అని నరహరి అన్నాడు. గురువు వెళ్తున్నరోజు నరహరి నయనాలు అశ్రుపూరితాలయ్యాయి,. గురువు కూడా బాధపడుతూ "నాయనా! దిగులు పడకు, భగవంతుణ్ణి ప్రార్థించు. నేను చెప్పిన కార్యం తప్పక సాధిస్తావు. జాగ్రత్తగా ఉండు..." అన్నారు.

నరహరి గజపతి మహారాజుగారి ఆస్థానంలో ఉద్యోగం సంపాదించాడు. అతణ్ణి ప్రజలంతా మంచి నడవడిక కలవాడని గౌరవించేవారు. భగవంతుని లీలలు చాలా విచిత్రమైనవి. గజపతి మహారాజు హఠాత్తుగా మరణించాడు. అతని భార్య గర్భవతిగా ఉంది. రాజ కుమారుడు పుట్టి పెద్ద వాడయ్యే వరకు ఎవరో ఒకరిని మహారాజుగా ఎన్నుకోవాలి. అందుకు పట్టపుటేనుగు ఎవరి మెడలో పూలదండ వేస్తుందో ఆ వ్యక్తి రాజ్యపాలన చెయ్యాలని నిర్ణయించారు. ఆ ఏనుగు తిన్నగా వచ్చి నరహరి మెడలో పుష్పహారాన్ని వేసింది. నరహరి మహారాజు అయ్యాడు. ఆయన పాలనలో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించారు. నరహరి మంచి రాజుగా పేరు తెచ్చుకున్నాడు. రాణికి మగ శిశువు జన్మించాడు. ఆ రాకుమారుడు అన్ని విద్యల్లో నైపుణ్యాన్ని సంపాదించిన తరువాత నరహరి అతనికి రాజ్యభారాన్ని అప్పగించాడు. రాజకుమారుడు "అయ్యా! మీరు ఎంతో దక్షతతో రాజ్యాన్ని పాలించారు. నేను మీకు ఏమి ఇవ్వగలను" అని అడిగాడు. నరహరి వినయంగా రాజుకు నమస్కరించి "రాజా మీ ఖజానాలో ఉన్న సీతారాముల విగ్రహాలను ఇప్పించండి" అన్నాడు. రాజకుమారుడు వెంటనే ఆ విగ్రహాలను తెప్పించి నరహరికి ఇచ్చాడు. తన గురువుకు విగ్రహాలు ఇవ్వాలని చెప్పి నరహరి రాజు వద్ద సెలవు తీసుకున్నాడు. ఇన్నేళ్ళు రాజ్య పాలన చేసినా ఈయన ఇంత నిరాడంబరంగా ఉన్నాడు. సీతారాముల విగ్రహాలు తప్ప ఏమీ కోరడం లేదే అని రాజు నరహరి త్యాగశీలతను కొనియాడాడు.

నరహరి గురువు వద్దకు వెళ్ళి వారికి పాదాభివందనం చేసి విగ్రహాలను గురువుకి సమర్పించాడు. గురువు భక్తితో వాటిని ఒక పీఠం మీద ఉంచి పూజించాడు. ఆశ్రమంలో మూడు నెలలపాటు ఉత్సవాలు జరిగాయి. 80రోజులు గురువు స్వయంగా ప్రతిరోజూ ఆ విగ్రహాలను పూజించాడు. అన్ని రోజులూ గురువును తృప్తిగా సేవించే భాగ్యం నరహరికి లభించింది. గురువు "నరహరీ! నేను నీ సేవలకు సంతుష్టుణ్ణయ్యాను. నువ్వు కొన్ని రోజులు తీవ్ర తపస్సాధనలు ఆచరించు. నా స్థానాన్ని నువ్వు అధిష్ఠించాలి" అని అన్నాడు.

ఇంత మంది పూజ్యులైన సాధువులుండగా గురువు తనను ఎన్నుకోవడం ఏమిటి అనుకుని "వద్దు గురుదేవా" అని నరహరి సున్నితంగా తిరస్కరించాడు. "గురువు ఆజ్ఞను పాటించవా?"అని అనడంతో నరహరికి గురువాజ్ఞను శిరసావహించక తప్పలేదు. ఆ గురువే ద్వైత మతాన్ని స్థాపించిన మధ్వాచార్యులు. శిష్యుడు నరహరి 'నరహరి తీర్థ గా' గురుస్థానాన్ని అలంకరించాడు. నరహరికి మహారాజయోగం, ఆధ్యాత్మిక గురువు అయ్యే యోగం ఉందన్న జ్యోతిష్కుని మాటలు నిజమయ్యాయి. ❖

(రామకృష్ణ సంఘ ఆంగ్ల మాసపత్రిక 'ప్రబుద్ధ భారత' జూన్ 2000 సంచిక నుంచి సేకరణ) అనువాదం: శ్రీమతి కె. జానకి

– ఆకెళ్ల రాఘవేంద్ర

కష్టం కష్టం కాదనే 'కిరాతార్జునీయం'

మహాభారతం ఆరణ్యపర్వంలో ప్రథమ ఆశ్వాసంలోని కథ 'కిరాతార్జునీయఘట్టం'. అస్త్రశస్త్రాల కోసం అర్జునుడు శివుణ్ణి ప్రార్థించడం, ఘోరతపస్సు చేయడం, పరమేశ్వరుడు స్వయంగా కిరాతుడి వేషంలో రావడం, వారిద్దరి మధ్యా యుద్ధం జరగడం – స్థూలంగా ఇదీ కథ. కిరాతుడు అంటే వేటగాడు. కేవలం కథగా మాత్రమే పైకి కనిపిస్తున్న ఈ ఘట్టంలో మానవ జీవితవికాసానికి కావలసిన 'అస్త్రాలెన్నో'ఉన్నాయి.

కెరటంలేని సముద్రం, కష్టం లేని మానవజీవితం – ఉండమన్నా ఉండవు. అమావాస్య చూడకుండా చంద్రుడు ముందుకు సాగలేడు. కష్టం, బాధ, సమస్య– ఏదైనా కావచ్చు – మనిషికి సహజం. ఎవరి కష్టం వారిది. పీత కష్టం పీతదీ. సీత కష్టం సీతదీ అన్నారు. పదో తరగతిలో ఫస్ట్ ర్యాంక్ రావడం లేదని ఒకరు బాధపడుతుంటే ఫస్ట్ క్లాస్ రావడంలేదని ఇంకొక విద్యార్థి కంగారుపడుతూ ఉండొచ్చు; అసలు పాస్ కావడం ఎలాగో అర్థం కాక మరొకరు తలపట్టుకొని ఉండొచ్చు.

ప్రమోషన్ రావడంలేదని ఒకరు బాధపడుతూంటే అసలు ఉద్యోగమే లేదని మరొకరు ఆందోళనపడుతూ ఉండవచ్చు. సంసారంలో సమస్యలు ఉన్నాయని ఒక ఇల్లాలో, ఇంటాయనో బాధపడుతూ ఉంటే అసలు వివాహమే కావడం లేదన్నది ఇంకొకరి సమస్య.

కష్టాలు, కన్నీళ్ళు, బాధలు, సమస్యలు... ఇవి అన్నీ సహజం. ఎంతటి వారికైనా సహజం, మంచివారికైనా సహజం – అని చెప్పేందుకే మహాభారతంలో పాండవుల అరణ్య, అజ్ఞాతవాసాలు. పాండవులు పడరాని పాట్లు పడ్డారు. రాజసూయయాగం చేసుకొని రాజ్యాన్ని ఏలుకొంటూ భోగాలు అనుభవించాల్సిన పాండవులు నారచీరలు కట్టుకొని, అస్త్రాలన్నీ వదిలేసి, రథాలు, రత్నాలు అన్నింటినీ విసర్జించి కందమూలాలు తింటూ అరణ్యాల్లో ఒకటి రెండు కాదు ఏకంగా పన్నెండేళ్ళు బతకాల్సి వచ్చింది. మారువేషాల్లో తమహోదాల్ని మరచిపోయి వంటవారిగా, పనివాళ్ళగా గడపాల్సి వచ్చింది అజ్ఞాతవాసంలో!

పాండవులకు ఎందుకిన్ని కష్టాలు? జూదంలో ఓడిపోయారు కాబట్టి–అనేది తర్కం ఇచ్చే సమాధానం; జాతక ఫలం అలా ఉంది కాబట్టి అనేది జ్యోతిష్యం ఇచ్చే జవాబు; కర్మఫలం అలా ఉంది అనేది వేదాంతం ఇచ్చే బదులు. కానీ అన్నింటికీమించి – పాండవులకు ఎందుకు కష్టాలు వచ్చాయి అనే అంశం కన్న – కారణంతో సంబంధం లేకుండా 'బాధలు పడక తప్పదు' అనే నగ్న సత్యాన్ని అందివ్వడం ఇందులో కీలకం.

అసలు అరణ్య, అజ్ఞాత వాసాలు వచ్చింది సామాన్య సైనికులకు కాదు – పాండవులకు. అంతిమ విజయం లభించింది మరెవ్వరికో కాదు – పాండవులకు! అంటే మనకు కూడా కష్టాలు వచ్చాయంటే అర్థం – రేపటి విజయం కోసం అడుగులు ముందుకు పడుతున్నాయన్నమాట. ఆ అడుగులు

ఇప్పుడు అష్టకష్టాలుగా మనకు కనిపిస్తున్నాయన్నమాట.

మనం లెక్కలు చేస్తున్నప్పుడు సులువుగా ఉన్న లెక్కలో, అప్పటికే జవాబులు తెలిసిన లెక్కలో చేస్తే – మన మెదడుకి పదునుపెట్టలేం. రెండురెళ్ళు నాలుగు అని చెప్పడానికి బుర్రను వేడెక్కిస్తామా? అలా కాకుండా ఎంతకూ తెగని లెక్క మనకు ఎదురైతే – జవాబు వెతికేందుకు పరిపరి విధాల ఆలోచిస్తాం; శ్రమిస్తాం; మెదడును పదును పెట్టిస్తాం. ఆ లెక్క తేలేందుకు ఎన్ని పరిష్కార మార్గాలున్నాయో అన్నీ వెతికి పట్టుకొంటాం.

జీవితమూ అలాంటి తెగని లెక్కల మొత్తమే!
ఒక్కో కష్టం ఒక్కో లెక్క అని గుర్తించండి!!
అలాంటి లెక్కల అంతు చూడడం ఓ లెక్కా అన్న
ఆత్మవిశ్వాసం పెంచుకొందాం.

టెన్నిస్ ఆడుతున్నప్పుడు బంతి ఎటువైపు వస్తుందో ముందే తెలిసిపోతే – ఇక ఆడేదేముంది? ఆ ఆటలో ఉత్సుకత ఏముంటుంది? అవతలి క్రీడాకారుడు బంతిని ఎటువైపు కొడతాడో తెలీదు, ఆ బంతిని మనం ఎటుగా ఎదుర్కోవాలో తెలీదు, ఆటలో మనం ఓడతామో, గెలుస్తామో తెలీదు ఇన్ని సమస్యలున్నప్పుడు మనం బాగా ఆడేందుకు ప్రయత్నిస్తాం, నిరంతరం ప్రాక్టీసు చేస్తాం. మెదడుకు పదును పెట్టి ఆడతాం,

ఎత్తుకి పై ఎత్తులు వేస్తాం. మనసుపెట్టి ఆడతాం. అన్నింటికీ మించి గెలవాలన్న తపనతో ఆడతాం. జీవితమూ అలాంటి ఆటే!

సమస్యవచ్చినప్పుడే మనం ఆలోచించడం ప్రారంభిస్తాం. ఆలోచించడం ప్రారంభించినప్పుడే నివురు గప్పిన నిప్పులా మనలో ఉన్న శక్తి బయటపడుతుంది. ఆ శక్తి బయటపడితే మనం ఏదైనా సాధించగలం. అంతేకాదు విజయం సాధించడానికి కావలసిన నేర్పరితనం ఆ సమస్య ద్వారా పొందగలుగుతాం.

అరణ్యవాసంలో పాండవులకు జరిగింది అదే!

రాబోయే కురుక్షేత్ర సంగ్రామంలో ఢీకొనవలసింది సామాన్య శత్రువులను కాదు. దుర్యోధన దుశ్శాసన కర్ణాదులను! అరివీరభయంకరులను! అతి బల సంపన్నులను!

మరి అలాంటి బల పరాక్రమవంతులతో పోటీ పడాలంటే పాండవులకు అంతకుమించిన బలం ఉండాలి కదా. అందుకే తమ తమ బలాల మీద నమ్మకం కలిగేందుకు, అస్త్ర శస్త్రాలను ఏర్పరచుకొనేందుకు వచ్చిన బంగారం లాంటి అవకాశం – అరణ్య, అజ్ఞాత వాసాలు అంటే అవి కష్టాలు కావు, శిక్షణా కాలం అన్నమాట.

అందుకే శివుణ్ణి ప్రార్థించి పాశుపతాస్త్రం సమకూర్చుకోమని కృష్ణుడు అర్జునుడికి హితవు పలికాడు–'తక్షణమే మనం యుద్ధం చేయడం లేదు కదా, మరి పాశుపతంతో పనేమిటి కృష్ణా' అని సందేహం వెలిబుచ్చాడు అర్జునుడు. రేపు కురుక్షేత్ర యుద్ధం అంటే ఈరోజు శివుణ్ణి ప్రార్థిస్తావా బావా'అని ఎదురు ప్రశ్న వేశాడు గీతాకారుడు. అంతే కదా–రేపు పరీక్ష పెట్టుకొని ఇవేళ పుస్తకాలు కొనం కదా, ఇవేళ చదవడం మొదలుపెట్టం కదా! పరీక్షలో సత్ఫలితం పొందాలంటే ముందే పుస్తకాలు సమకూర్చుకోవాలి. కృష్ణుడు చెప్పిందదే!

అర్జునుడు శివుడికై తపస్సు చేయడం ప్రారంభించాడు. ఆరంభించిన అర నిమిషానికే పరమేశ్వరుడు ప్రత్యక్షం కాలేదు. మనకూ అంతే! పని మొదలుపెట్టిన వెంటనే ఫలితం వచ్చేయదు.. కఠోరమైన తపస్సు చేయాలి. తదేకదీక్షతో కృషి చేయాలి. పంచేంద్రియాల్నీ, ఆత్మనూ మన లక్ష్యంపై కేంద్రీకరించాలి. అర్జునుడు చేసిందదే. ఘోర తపస్సు చేసిన తరువాతే అర్జునుడికి పరమశివుడు ప్రత్యక్షమయ్యాడు.

ఎలా? కిరాతుడి వేషంలో! పైగా మూకాసురుడు అడవి పంది రూపంలో వచ్చి అర్జునుడి తపస్సుకు భంగం కలిగించడం మొదలుపెట్టాడు. మొదట దాన్ని పట్టించుకోకుండా అర్జునుడు తపస్సును కొనసాగించాడు. కానీ ఆ పంది భీకరారావాలు మరీ పెరిగి పోయాయి. లాభం లేదు అని అర్జునుడు గాండీవం తీసి దాని మీద బాణం వేశాడు. సరిగ్గా అదే సమయంలో కిరాతుకుడి వేషంలోని శివుడి బాణం కూడా దానికి తగిలింది. ఆ సూకరం నేల కొరిగింది.

ఇప్పుడు ఆ సూకరం ఎవరిది? అర్జునుడిదా! శివుడిదా!! నాదంటే నాదని ఇద్దరూ తగవులాడుకొన్నారు. చివరకు వారిద్దరి మధ్య పెద్ద యుద్ధమే జరిగింది. సాక్షాత్తూ శివుడితోనే అర్జునుడి యుద్ధం! చివరకు అర్జునుడే గెలిచాడు. నీ భక్తికే కాదు శక్తికీ మెచ్చానంటూ అర్జునుడికి పశుపతినాథుడు పాశుపతం ఇచ్చాడు.

ఈ కథ అంతరార్థం ఏమిటి?

కష్టం సృష్టించిందీ శివుడే! శివుడి ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు కదా! పరీక్ష పెట్టిందీ శివుడే! మారు వేషంలో వచ్చిందీ శివుడే!! యుద్ధం చేసిందీ, చేయమన్నదీ శివుడే!! చివరకు గెలిచినది అర్జునుడు! తన శక్తిమీద తనకు నమ్మకం ఉన్న అర్జునుడు.

మనమూ ఆ విజయుడిలా అజేయులం కావాలి. అర్జునుడు కోరిన వెంటనే అస్త్రాన్ని అందివ్వలేదు శంకరుడు. ముందో పరీక్ష పెట్టాడు. చిన్న పిల్లాడు స్కూటర్ కావాలని అడిగితే ఏ తండ్రి అయినా ఇస్తాడా? కొనగలిగిన శక్తీ ఉంది, పిల్లాడి మీద ప్రేమా ఉంది. అయినా పిల్లాడికి స్కూటర్ ఎందుకివ్వడు ఆ తండ్రి? ఎందుకంటే – స్కూటర్ ఇచ్చినా ఆ పిల్లాడికి దానిని నడపగల సామర్థ్యం లేదు కాబట్టి! కావాలంటే సైకిలిస్తాడు ఎందుకంటే ఆ పిల్లాడి శక్తి అంతే కాబట్టి! భగవంతుడూ అంతే! మనం ఏది కోరితే అది ఇవ్వడు. మన శక్తి సామర్థ్యాల్ని పరీక్షిస్తాడు. అవే కష్టాలు అనుకొంటాం మనం – మనకు శక్తి ఉంటే భగవంతుడు ఆకాశాన్ని బద్దలు కొట్టి ఇస్తాడు – అర్జునుడికి శివుడు ఇచ్చినట్లు!

ఆయుధాల్ని సమకూర్చుకొనేందుకూ, మన శక్తి సామర్థ్యాల్ని వెలికి తీసుకొనేందుకూ ఎదురయ్యే 'కష్టం కష్టం కాదు' అని గుర్తిస్తే మనం చేపట్టిన కార్యంలో తప్పక విజయం సాధించగలం. ❖

వివేకానందకు విలువైన కానుక !

– స్వామి సేవ్యానంద



యువతరాన్ని స్వామి వివేకానంద ప్రేమించినంతగా బహుశా మరెవరూ ప్రేమించలేదేమో! తన అమూల్యమైన ప్రేమతో యువతరాన్ని బంధించిన యువనేత, మార్గదర్శకుడు, మిత్రుడు అయిన స్వామీజీకి నేటి యువతరం ఇచ్చే కానుక ఏమిటి?

మాతృభూమిలో అరుణోదయం: పంథొమ్మిదవ శతాబ్దంలో మనకు ఎదురైన విదేశీ సంస్కృతి తళుకుబెళుకులకు ముగ్ధులమై, మన ధర్మాన్ని దూషించడం మొదలుపెట్టాం. 'హిందూ ధర్మం' మూఢనమ్మకాల పుట్ట అనీ, ఆధునిక విజ్ఞానం ముందు ఇది నిలబడడం అసంభవమనీ ప్రచారం చేశాం.

ప్రపంచంలోని ఆధ్యాత్మిక సంపదను రక్షించే దివ్య అరుణోదయానికి మరోసారి సమయం ఆసన్నమైంది. శ్రీరామకృష్ణుల రూపంలో ఈ అరుణోదయం జరిగి, వివేకానందుని ద్వారా 'సనాతన ధర్మం' లోని నిగూఢమైన సత్యాలకు నూతన నిర్వచనాలను చెప్పింది. అంధకారంలో తడుముకుంటున్న ఆధునిక ప్రపంచానికి సరైన ఆధ్యాత్మిక మార్గాన్ని చూపించింది.

ఈ ఆధ్యాత్మికతను పునాదిగా చేసుకొనే మనం భారతమాతను విదేశీయుల బంధాల నుంచి విడిపించి, స్వేచ్ఛా సింహాసనంపై విరాజింపజేసాం. ఈ ప్రయత్నంలో మన యువతరం చూపిన ధైర్యసాహసాలు, త్యాగభావం మనం ఎన్నటికైనా మరచిపోగలమా? మన దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడమే మనం స్వామీజీకి ఇచ్చే కానుకా? దీనితో మన కర్తవ్యం పూర్తయిందా? లేదు. మాతృభూమి పట్ల మన బాధ్యత మరింత పెరిగింది.

బాధ్యత అందరిదీ.... నేడు ఎన్నో రంగాలలో అభివృద్ధి చెందుతూ ముందుకు సాగుతున్న ఈ పవిత్ర భూమిలో జన్మించినందుకు మనమంతా గర్వపడాలి. అయితే, ఋషులకూ, మహర్షులకూ వారసులైన భారతమాత సంతానంలో చాలా మందికి (సుమారు 35 శాతం) ఇప్పటికీ ప్రాథమిక విద్య, వైద్య సదుపాయాలు అందడం లేదు.

టెలివిజన్, సినిమా, వార్తాపత్రికలు సమాజంలో వ్యతిరేక ఆలోచనలనూ, వినాశాత్మక భావాలనూ ప్రచారం చేయడానికి ప్రాధాన్యమిస్తున్నాయి. వీటి ప్రభావంతో నేటి యువతరం మన విలువైన ఆధ్యాత్మిక, సంస్కృతీ సంపదలకు దూరమై చుక్కాని లేని నావలా లక్ష్యం లేని జీవితాన్ని గడుపుతోంది. ఈ సమస్యలకు సమాధానం ఏమిటి?

దృష్టి మారితే సృష్టి మారుతుంది. అన్ని దోషాలకూ మన దేశాన్ని నిందించే స్వభావాన్ని వదిలిపెట్టి, ముందు మనం మారితే ఈ సమాజంలోని సమస్యలు వాటంతటవే సమసిపోతాయి.

యువతరం ఇచ్చే కానుక: "బలవంతులూ, ఉత్సాహవంతులూ, శక్తిమంతులూ, అత్యంత నిజాయతీ పరులైన, జీవశక్తితో ఉట్టిపడే విశ్వాసపాత్రులైన యువకులు ఒక్క వందమంది లభిస్తే చాలు, యావత్తు ప్రపంచం మారుతుంది" అని స్వామీజీ చెబుతారు. మనమంతా స్వామీజీ సైనికులమే! సర్వసంపదలకూ నిలయమైన భారతదేశాన్ని ప్రపంచంలో అగ్రస్థానానికి తీసుకువెళ్ళే బాధ్యత మనందరిపైనా ఉంది. మన మాతృభూమికి ఆయువుపట్టయిన ఆధ్యాత్మికతను ఆధారంగా చేసుకొని, స్వామీజీ ఇచ్చిన 'త్యాగము – సేవ' అనే మహామంత్రాన్ని ఆచరణలో పెడితే, కొద్ది రోజులలోనే విజయపతాకాన్ని ఎగురవేయగలం. మనలో ఉన్న అహంకారాన్నీ, స్వార్థస్వభావాన్నీ 'త్యాగం' చేసి, భరతమాతకూ, మానవ రూపంలో ఉన్న మాధవునికీ 'సేవ' చేయడానికై మన జీవితాలను అంకితం చెయ్యాలి. 'అశాంతి'తో వినాశనానికి చేరువవుతున్న నేటి ఆధునిక ప్రపంచానికి 'అభీ! అభీ! (భయపడవద్దు! భయపడవద్దు!!)" అనే గంభీర సింహగర్జనలతో ధైర్యం చెప్పే వేదాంత వాక్కులను ప్రచారం చేసి, 'శాంతి'ని నెలకొల్పాలి.

ఇదే నేటి యువతరం స్వామి వివేకానందకు ప్రేమతో ఇచ్చే విలువైన కానుక! ❖

మనసుతో మల్ల యుద్ధం!

'మనస్సు స్వాధీనానికి అడ్డుపడే ఆలోచనలు చెలరేగినప్పుడు, వాటికి వ్యతిరేకమైన ఆలోచనలను ఉపయోగించాలి' అని యోగాచార్యుడు బోధించాడు.

ఉదాహరణకు మీ మనస్సులో ఏదో కారణం వల్ల కోపం ఒక ఉప్పెనలా పైకి లేస్తున్నదనుకోండి. అది చాలాకాలం వరకూ మీ ప్రశాంతతను చెదగొట్టడమే కాక, మీ మానసిక స్థితికి గొప్ప హాని చెయ్యగలదు. దాన్ని చెదరగొట్టడం ఎలా? దానికి వ్యతిరేకమైన మరొక అలను సృష్టించడమే! ప్రేమపూర్వకమైన ఒక ఉత్తుంగ తరంగాన్ని దానికి ఎదురు పంపండి. కామం మీ మనసులో ఒక పెద్ద తరంగం లాగ ఎగిస్తే, దానికి ఎదురుగా పవిత్రమైన ఆలోచనలనే అలను లేపండి. ఒక మహాత్ముని పవిత్ర జీవితాన్ని గురించి గంభీరంగా యోచించడం ద్వారా మీరు అలాంటి తరంగాన్ని సృష్టించవచ్చు.

అయితే చెడు ఆలోచనలు పుట్టీపుట్టకముందే వాటికి వ్యతిరేకమైన మంచి ఆలోచనలను మనం తయారు చెయ్యాలి. కోపం మీ మనస్సులో ఒక చిన్న బుడగగా ఉన్నప్పటిదొక పరిస్థితి. మీరే ఆ కోపంగా మారిపోయినప్పటిది ఇంకొక పరిస్థితి. అవి చిన్న బుడగలుగా ఉన్నప్పుడే వాటికి వ్యతిరేకంగా మంచి ఆలోచనలను మనం తయారు చేసుకోవాలి. లేకపోతే ఈ పద్ధతి పనిచెయ్యదు. ఒకసారి చెడు ఆలోచనలు పెరగడానికి చాలినంత వ్యవధిని ఇచ్చిన తరువాత వాటిని ఎదుర్కోవడం కష్టం. మనం మన ఆలోచనలనూ, ఆవేశాలనూ ఎల్లప్పుడూ సూక్ష్మంగా, నిశితంగా గమనిస్తూ ఉండాలన్నమాట!

ఒక్కొక్కసారి మనం ముందుగా ఏర్పడుతున్న బుడగలను గమనించం. అవి పెద్ద అలలుగా మారిన తరువాతే వాటిని గమనిస్తాం. అలాంటి పరిస్థితులలో ఏం చెయ్యాలి? ఆ స్థితి నుంచి, ఆ ప్రదేశం నుంచి బయటకు వెళ్ళిపోయి, ఏకాంతంలో ఆత్మవిమర్శ చేసుకోవాలి. మన మనస్సును 'ఓ మనసా! ఇది నిన్ను సర్వనాశనం చేస్తుంది. ఈ విషయం నీకు అర్థం కావడం లేదా?' అని అడగాలి. ఈ ఆలోచనను మనస్సుపై బలంగా రుద్దగలిగితే మనస్సు చక్కగా ప్రవర్తించడం నేర్చుకుంటుంది. ఎందుకంటే దాని నాశనాన్ని అదే కొనితెచ్చుకోదు కదా!

ఒకసారి ఒక శిష్యుడు స్వామి బ్రహ్మానందజీని ఇలా ప్రశ్నించాడు: 'మనస్సులో కలవరపెట్టే ఆలోచన ఒకటి వదలకుండా వెంటాడుతూ ఉంటే ఏం చెయ్యాలి?' దానికి ఆయన ఇలా సమాధానమిచ్చారు:

" 'ఈ ఆలోచన నాకు అత్యంత అపాయకరమైనది. ఇది నా నాశనాన్ని కొనితెస్తుంది' అని ఆలోచించండి. ఈ ఆలోచనను మీ మనస్సుపై మళ్ళీ మళ్ళీ బలంగా ముద్రించండి. అప్పుడు మనస్సు ఆ కలవరపరిచే ఆలోచన నుంచి విముక్తి పొందుతుంది."

పదే పదే చెప్పే సూచనలకు మనస్సు లొంగిపోతుంది. దానికి మనం ఏది నేర్పితే అది నేర్చుకుంటుంది. విచక్షణ ద్వారా దానికి ప్రాపంచిక బంధాలలోని దుఃఖాన్నీ, ఆధ్యాత్మిక జీవనంలోని ఆనందాన్నీ, పరిపూర్ణతనూ వివరించి, దానిపై గట్టి ముద్ర వేయగలిగితే అప్పుడు మనస్సు తనను తాను మరింతగా భగవంతునికి సమర్పించుకుంటుంది.

మనస్సుతో జరిపే మల్లయుద్ధం కన్నా మనిషిని అలసిపోయేలా చేసేది మరొకటి లేదు. మనం ఎంతగా అలసిపోతామో మనస్సు అంతగా అల్లకల్లోలమవుతుంది. చివరికి మనమే దానిలో కొట్టుకుపోతాం. అలాంటి పరిస్థితిలో మనస్సును ఎదుర్కొని పోరాడడం సమంజసం కాదు. మరి ఏం చెయ్యాలి? మనల్ని మనం మనస్సుతో ఏకీభవించుకోవడం మానివెయ్యాలి. ఇదే చేస్తే మనం గొప్ప విజయం సాధించినట్లే.

మనల్ని మనం మనస్సుతో ఏకీభవించుకున్నంత కాలం, మన మనస్సును స్వాధీనం చేసుకోలేం. ఎప్పుడైతే మనల్ని మనం మనస్సు నుంచి వేరుగా భావిస్తామో అప్పుడిక దానికి అల్లరి చెయ్యడానికి ఎలాంటి అవకాశమూ దొరకదు. అప్పుడు మనసుతో జరిపే మల్ల యుద్ధంలో విజయం మనదే! ❖

– స్వామి పరిజ్ఞేయానంద

డి. వేంకటేశ్వర రావు, పామర్రు

ప్రశ్న: నేను డిగ్రీ ఆఖరి సంవత్సరం చదువుతున్నాను. నాది అతిగా మాట్లాడే స్వభావం. అందువల్ల నా మాటలను ఎవరూ పట్టించుకోవడం లేదు. పైగా అందరూ నన్ను చులకనగా చూస్తున్నారు. నాకు జీవితం మీద అవగాహన ఉంది కానీ ప్రతి విషయాన్నీ తేలిగ్గా తీసుకుంటాను. ఈ సమస్యలకు సూచనలు ఇవ్వగలరు.

జవాబు: ఏ విషయంలోనూ 'అతి' పనికిరాదు. హద్దులు దాటిన 'అతి' సునామీగా మారి మన జీవితాన్ని ముంచుతుంది. 'అతి' వ్యామోహం వల్ల రావణుడూ, 'అతి' రాజ్యకాంక్ష వల్ల దుర్యోధనుడూ, 'అతి' అభిమానం వల్ల కర్ణుడూ తమ వినాశనానికి తామే కారకులయ్యారు. కాబట్టి మన జీవితం తుదివరకూ సాఫీగా సాగాలంటే 'అతి' అనే పదాన్ని మన నిఘంటువు నుంచి తొలగించాలి.

అతిగా తింటే అజీర్ణం, అసలు తినకపోతే నిర్వీర్యం.
అతిగా నిద్రిస్తే జడత్వం, అసలు నిద్రపోకపోతే అలసత్వం.
అతిగా మాట్లాడితే అవమానం, అసలు మాట్లాడకపోతే అనుమానం.

'అతిగా తినడం, అసలు తినకపోవడం; అతిగా నిద్రపోవడం, అసలు నిద్రపోకపోవడం; అతిగా మాట్లాడడం, అసలు మాట్లాడకపోవడం– ఇలా అన్ని వ్యవహారాల్లో అతిగా ప్రవర్తించే వారికి మనోనిగ్రహం సాధ్యం కాదు. అలాంటివారు కార్యసిద్ధిని పొందడం అసాధ్యం'అంటాడు శ్రీకృష్ణుడు.

అతిగా మాట్లాడే అలవాటున్న భార్యాభర్తలిద్దరు భోజనం చేయడానికి కూర్చోగానే భర్త ఏదో వంకతో భార్యను నిందించడం మొదలుపెట్టేవాడు. భార్య కూడా మాటకు మాట బదులు చెప్పేది. అందువల్ల ఆ ఇద్దరి మధ్య రోజూ వాగ్యుద్ధం జరుగుతుండేది. ఈ సమస్య నుండి ఎలా బయటపడాలో చెప్పమని ఆమె ఒక వృద్ధురాలిని సలహా అడిగింది. అందుకు ఆ వృద్ధురాలు ఆమెకు ఒక ఔషధం (tonic) ఇచ్చింది. రోజూ భర్తకు భోజనం వడ్డించిన తరువాత రెండు చెంచాల మందుని తన నోట్లో వేసుకొని, పావుగంట తరువాత మింగమని చెప్పింది. ఆ వృద్ధురాలు చెప్పిన రోజునుంచే ఆమె ప్రయోగం ప్రారంభించింది. ఎప్పటిలాగే భర్త భోజనానికి కూర్చోగానే తిట్ల దండకం మొదలుపెట్టాడు. ఆమె నోటిలో మందు ఉండడం వల్ల భర్త మాటలకు బదులు చెప్పలేకపోయింది. ఇలా కొన్నాళ్ళు గడిచిన తరువాత వారిద్దరి మధ్య గొడవలు తగ్గాయి. అప్పుడు వృద్ధురాలు ఆమెతో ఇకపై మందు వాడనవసరం లేదని చెప్పింది. ఆమె మాట్లాడడం తగ్గిస్తే భర్త మారుతాడనే సంగతి ఆ వృద్ధురాలికి తెలుసు. ఇంతకీ ఆ మందు ఏమిటంటే... గ్లూకోజ్ నీళ్ళే!

అతిగా మాట్లాడడం, ప్రతిదాన్నీ తేలిగ్గా తీసుకొనే స్వభావం గల మీరు స్వామి వివేకానంద ఇచ్చిన ఈ సందేశాన్ని రోజూ నెమరు వేసుకుంటే మీ ఈ సమస్యల నుండి బయటపడగలరు.

Give up the awful disease that is creeping into your blood, that idea of ridiculing everything, that loss of seriousness. Give that up. Be strong and everything else is bound to follow. *- Swami Vivekananda*

జీవితంలో అన్ని అనర్థాలకూ ఆది 'అతి' అని గుర్తుంచుకొని వ్యవహరించిననాడు మనకు లక్ష్యంపై ఒక అవగాహన ఉండడమే కాదు దాన్ని సాధించడంలో పట్టుదల కూడా పెరుగుతుంది. అప్పుడు అందరూ మన మాటలకు విలువనిస్తారు, మనల్ని అభిమానిస్తారు, అభినందిస్తారు. ❖

మీ సందేహాల్ని పంపాల్సిన చిరునామా :
యువవాణి
శ్రీరామకృష్ణ ప్రభ, రామకృష్ణ మఠం,
దోమల్‌గూడ, హైదరాబాద్ – 500 029

మహనీయుల జీవితాల్లో

మధురఘట్టాలు

- జి. సతీష్



అసంభవమన్నది లేనే లేదు!

ఆల్ప్స్ పర్వతాలకు క్రింది భాగంలో ఉన్న ఒక గుడిసెలో ఒక వృద్ధురాలు నివసిస్తూ ఉండేది. నెపోలియన్ తన సైన్యంతో అటు రావడం చూసి, ఆమె బయటకు వచ్చింది. నెపోలియన్‌ను సమీపించి, "నాయనా! ఏ పని మీద బయలు దేరావు? దుర్గమమైన ఈ కొండను ఎక్కే సాహసం మాత్రం చేయవద్దు. తిరిగి వెళ్ళు. ఇంతకు ముందు అనేక మంది ఇలాగే ప్రయత్నించి ప్రాణాలను కోల్పోయారు" అంది.

నెపోలియన్ దృఢస్వరంతో, "అమ్మా! ఒకసారి అడుగు ముందుకు వేసిన తరువాత నేను వెనుకంజ వేయను. మార్గంలో ఎన్ని ఆటంకాలు, కష్టాలు రానీ! వాటిని అధిగమించి నేను ముందుకు సాగిపోతాను. ఈ కార్యంలో నేనే కనుక విజయం సాధిస్తే ప్రపంచం నన్ను కీర్తిస్తుంది. ఒకవేళ నేను మరణిస్తే కనీసం నీవైనా నా ధైర్య సాహసాలను మెచ్చుకొంటావు కదా. ఇక ఇప్పుడు నేను ఆగేది లేదు. నేను విజయం పొందాలని ఆశీస్సులను అందించు" అని నమస్కరించాడు.

వృద్ధురాలు గద్గదస్వరంతో "నాలోని అణువణువూ నిన్ను ఆశీర్వదిస్తోంది. నా ఆశీర్వాదాన్ని అందుకో. వీరుడవైన నీ కోరికను భగవంతుడు నెరవేరుస్తాడు. వెళ్ళు. సాహసంతో ముందుకు సాగిపో!" అని నెపోలియన్‌తో అంది.

నెపోలియన్ వెంటనే తన సైన్యంతో ఆల్ప్స్ పర్వతాలను దాటి శత్రువులపై దాడి చేశాడు. విజయం సాధించాడు. అసంభవమన్నది తన నిఘంటువులో లేదని నిరూపించాడు ఆ యోధుడు. ❖

పురోగతికి అవరోధం...

రామానుజాచార్యులు శారీరకంగా చాలా దుర్బలమైనవారు. నదీస్నానం ఆయనకు నిత్యకృత్యం. స్నానానికి వెళ్ళేటప్పుడు ఒక బ్రాహ్మణుని భుజంపై చేయివేసి వెళ్ళేవారు. వచ్చేటప్పుడు ఒక శూద్రుని భుజంపై చేయి వేసి వచ్చేవారు. జనులు ఆశ్చర్యంగా చూసేవారు. ఒకరు ఆయనతో, 'స్వామీ! తమరు స్నానం చేసి ఏం లాభం? శూద్రస్పర్శతో తాము అపవిత్రం అవుతూనే ఉన్నారు కదా!" అని అడిగారు.

ఆచార్యుల వారు మందహాసం చేసి, "స్నానం వల్ల నా దేహం మాత్రమే శుభ్రం అవుతోంది. మనస్సులోని మాలిన్యం పోవడం లేదు. ఇతరుల కన్నా నేను గొప్పవాణ్ణి అనే భావన అహంకారం అనిపించుకుంటుంది. మనిషి పురోగతికి ఈ ఆధిక్యభావన అన్నింటినీ మించిన ఆటంకం. స్నానం చేసి దేహమాలిన్యాన్ని పోగొట్టుకున్న తరువాత నేను శూద్రుణ్ణి తాకి నా అహంకారాన్నీ, మనోమాలిన్యాన్నీ తొలగించుకుంటున్నాను. నేను ఎవరి కన్నా గొప్పవాణ్ణీ కాను. నా కన్నా ఎవరూ తక్కువ వారూ కారు. నా కన్నా శూద్రుడు కూడా శ్రేష్ఠుడే అనే భావన వల్ల నాకు ఆనందం లభిస్తుంది" అన్నారు.

రామానుజాచార్యుల వారి వినమ్ర స్వభావానికి శ్రోతలు ముగ్ధులై, శ్రద్ధాభక్తులతో తలలు వంచి నిలుచుండిపోయారు. ❖



విద్యలో విలువల ఆవశ్యకత

– డాక్టర్ కమల ఎస్. జయరావు

విలువలు అంటే ఏమిటి? సత్యవచనం, నిజాయతీ, చిత్తశుద్ధి, వినయం, నిర్భయత్వం, మనోస్థైర్యం, దయ, ప్రేమ, ఇంద్రియ నిగ్రహం మొదలైన లక్షణాలే విలువలు అని పేర్కొనవచ్చు. ఈ విలువల్ని జీవితంలో ఆచరించడం వల్లనే శీలనిర్మాణం సాధ్యమవుతుంది.

పిల్లల శీలనిర్మాణంలో విద్యకు ప్రధాన పాత్ర ఉంది. విద్య అంటే సాధారణంగా బడిచదువు–నియత విద్య. నిజానికి, విలువల్ని పెంచే విద్య ఇంట్లోనే ప్రారంభమవుతుంది. "బాలుడు నడవవలసిన తోవ వాడికి నేర్పు, వాడు పెద్దవాడైన పిదప దాని నుండి తొలగిపోడు!" అన్నది బైబిలు వాక్యం. "మొక్కై వంగనిది మానై వంగునా!" అనే సామెత తెలుగులో ఉంది. తల్లి తండ్రులు, ఇంట్లోని ఇతర పెద్దల నుండి పొందిన శిక్షణ పిల్లల శీలనిర్మాణానికి పునాది. మన దేశంలో ప్రస్తుతం పిల్లల్ని రెండు మూడేళ్ల వయస్సులోపే బడికి పంపుతున్నాం. ఇది పొరపాటు. ఆ వయస్సులోని పిల్లలకు ఏది చేయవచ్చునో, ఏది చేయరాదో చెప్పినా అర్థం చేసుకొనే శక్తి ఉండదు. పిల్లలకు సహజంగానే వారి పరిసరాల పట్ల చాలా కుతూహలం ఉంటుంది. శీల నిర్మాణమంటే, ఈ కుతూహలాన్ని నాశనం చేయకుండానే పిల్లల ఇంద్రియాలను అదుపులో పెట్టగలగటం, మరొక విధంగా చెప్పాలంటే "అహం – నేను అనే భావం 18 నుండి 24 నెలల వయస్సులో అభివృద్ధి చెందటం మొదలవుతుంది. ఈ అహంభావాన్ని ఇంటి వాతావరణంలోనే అదుపు చేయ ప్రయత్నించటం శ్రేయస్కరం. బుడి బుడి నడకలు, పరుగులు నేర్చిన 20, 30 మంది పిల్లలను ఒక్క తరగతి గదిలో అదుపు చేయప్రయత్నించడం కష్టంతో కూడుకొన్నపని. అందువల్ల పిల్లలు అదుపు తప్పి క్రమశిక్షణా రహితులైనా అవుతారు, లేదా పూర్తిగా అణగారి పోయి వారు స్వతంత్రంగా ఆలోచించే శక్తినైనా కోల్పోతారు. ఈ వయస్సులో బడిలోని శిక్షణ ఇంద్రియజ్ఞానాభివృద్ధికి తోడ్పడుతుందేకాని శీలనిర్మాణానికి ఉపయోగపడుతుందనలేం. 40, 50 సంవత్సరాల క్రితం వరకూ భారతదేశంలో బాలబాలికలకు ఐదు ఏళ్ళ వయస్సులో అక్షరాభ్యాసం చేయించి, బడికి పంపేవారు. ఈ పద్ధతి నేటికీ చాలా పాశ్చాత్యదేశాలలో పాటిస్తున్నారని చెప్పుకుంటారు. మనం పూర్వపద్ధతిని మరలా ఎంత త్వరగా ప్రారంభిస్తే అంత మంచిది.

స్థిరమైన బలమైన శీలం కల జాతి మాత్రమే గొప్పది కాగలదు. పాశ్చాత్య దేశాలలో జాతీయజీవనమనే కట్టడాన్ని బలమైన స్తంభాలు పటిష్ఠంగా నిలిపి ఉంచాయని స్వామి వివేకానంద అన్నారు. అది పంథొమ్మిదవ శతాబ్దం నాటి మాటే కానీ, భారతదేశంతో పోలిస్తే అవి నేటికీ గట్టిగానే ఉన్నాయని చెప్పవచ్చును. పూర్వం మనదేశ పరిస్థితి ఇంత గర్హనీయంగా లేదు. జాతి తన సుదీర్ఘ చరిత్రలో దారుణ విపర్యయాలను, ఒడిదొడుకులను ఎదుర్కొనగలిగిందంటే ఆనాడు ప్రజలకున్న గొప్ప శీలమే కారణం. ఆ శీలం ఈనాడు దుర్బలమైంది. స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఈ పుణ్యభూమిపై నడిచిన పురుషులు, స్త్రీలు గొప్ప శీలవంతులు. ఈనాడు జాతి మనోఫలకం నుండి వారి

స్మృతులను, ఉనికిని ఇంత సులభంగా ఎలా తొలగించుకొన్నామో ఆలోచిస్తే దుఃఖమూ, ఆశ్చర్యమూ కూడా కలుగుతాయి. పోతే నడుము విరిగే ఆర్థిక సామాజిక భారాలను మోస్తున్న మన గ్రామీణులలోనూ, చాలావరకు నగర బస్తీ ప్రజలలోనూ నిజమైన భారతీయ శీలం ఇంకా స్పష్టంగా కనపబడుతున్నదన్నది ముదావహం. విద్యావంతులమని చెప్పుకునే నగరవాసులలోనే శీలం క్షీణిస్తున్నది. దీనిని పరమపూజ్యులు స్వామి రంగనాథానంద మహరాజ్ గారు "నాకు, నావారికి, – మిగతా వారేమైతే నాకేమి' అనే భావంగా పేర్కొనేవారు.

మధ్యతరగతి ప్రజలు జాతి వెన్నెముకవంటి వారు. కనుక వారి పిల్లలకే శీలబోధన ఆవశ్యకత ఎక్కువగా ఉంటుంది. ఈ పిల్లలే ఇంట్లో నేర్పబడిన మంచి విలువలకూ, సమాజంలో కనపడే తద్విరుద్ధ ఆచరణకూ గల భేదం మూలంగా విపరీత సంఘర్షణకు లోనవుతారు. ఈ తరగతి ప్రజలలో శీలం పునాదులు ఎందుకు త్వరితంగా కూలిపోతున్నాయో విశ్లేషించవలసిన ఆవశ్యకత ఉంది. మన జాతి రుగ్మతలకు బ్రిటీషువారు ప్రవేశపెట్టిన విద్యావిధానాన్ని నిందించటం మనకు పరిపాటి అయింది. పోతే స్వామి వివేకానంద, గాంధీ మహాత్ముడు, తదితర మహానుభావులు సైతం ఈ విద్యనే అభ్యసించారన్నది విస్మరించరాదు. కనుక బ్రిటీషు వారినే నిందించడం సరైన పద్ధతి కాదేమో! అసలు సంగతి ఏమిటంటే, నేటి విద్యావిధానంలో విజ్ఞాన శాస్త్రానికి ఇవ్వవలసిన ప్రాధాన్యం కంటే ఎక్కువ ఇస్తున్నాం. తత్కారణంగా, 'ఆర్ట్స్'గా చెప్పబడుతున్న శాస్త్రాలను చిన్నచూపు చూస్తున్నాం. దేశ చరిత్ర, సంస్కృతి తెలిసి ఉండటం శీలనిర్మాణంలో ప్రముఖపాత్ర పోషిస్తుంది. సాంస్కృతిక వారసత్వానికి పిల్లలకు ఉన్న ప్రవేశద్వారాలు రెండు. ఒకటి మానవ సంబంధ శాస్త్రాలు, రెండు లలిత కళలు. నేడు తల్లితండ్రులు ఈ రెండింటినీ నిర్లక్ష్యం చేస్తున్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలే ప్రధానమని, వాటికే పెద్దపీట వేసే అనారోగ్యకరమైన వాతావరణం సమాజంలో నెలకొన్నది. శాస్త్ర సాంకేతిక రంగాలకు మానవీయతతో సంబంధం ఉండదు. శీలం వ్యక్తిగతమైనది.

మా తరం నగర వాసులకు బడిలో ఇంగ్లీషులో నర్సరీ రైమ్స్, మాతృభాషలో సుభాషితాలు, నీతి శతకాలు నేర్పేవారు. అర్థం తెలియకపోయినా, చిలుకల్లాగ ఉల్లాసంగా అన్నీ నేర్చుకునేవారం. ఇంగ్లీషు పద్యాలు భాషాపరిజ్ఞానానికి తోడ్పడుతాయనీ, మాతృభాష పద్యాలు విలువలు బోధించేవిగా ఉన్నాయనీ పెద్దయిన పిదప తెలిసుకొన్నాం. నేటి ప్రపంచంలో ఇంగ్లీషు భాష ఒక ముఖ్యమైన అవసరమే. అయినప్పటికీ, దానిని తలపై పెట్టుకొని మాతృభాషకు దూరమవడం శోచనీయం. తత్ఫలితంగా జాతికి సాంస్కృతిక వారసత్వంతో ఏమాత్రం పరిచయం లేకుండా పోతున్నది. ఈ తరం తల్లితండ్రులకే కాదు, అధిక శాతం తాతా నాయనమ్మలకు, అమ్మమ్మలకు సైతం మన పురాణాలలోను, ఇతిహాసాలలోను ఉన్న ఆసక్తికరమైన కథలు తెలియనే తెలియవు. పూర్వం నీతికథలు, పద్యాలు, జానపదగాథలు తల్లితండ్రులు చెప్పడం పిల్లలు వినడం జరిగేది. ఈ సంప్రదాయం ఇప్పుడు కనుమరుగు అవుతున్నది. ఇటువంటి సాహిత్యం బోధనాంశంగా కాకపోయినా, విలువల్ని పెంచేందుకూ, శీలనిర్మాణానికీ ఉపకరించేది. కొన్ని ప్రచురణ సంస్థలు, ఆధ్యాత్మిక సంస్థలు ఈ సాహిత్యాన్ని సమాజంలో తిరిగి ప్రవేశపెట్టటానికి ప్రయత్నం చేస్తున్నాయి. ఇది ప్రశంసనీయమే కానీ ఇంత మాత్రమే సరిపోదు. ఈ సాహిత్యాన్ని బాలల సాహిత్యంగా భావించి, చిన్నచూపు చూడక దాని విలువను తల్లితండ్రులు గుర్తించాలి.

నేడు శీలనిర్మాణానికి ప్రధాన ఆటంకాలు మూడు:

1. వినియోగదారీ తత్త్వం (కన్స్యూమరిజం).
2. ప్రసార మాధ్యమాలు.
3. అవినీతి, అన్యాయాలు. ❖

(శీలనిర్మాణానికి ఆటంకాలుగా నిలిచే ఈ మూడు అంశాలపై వివరణ వచ్చే సంచికలో...)

శ్రీ రామకృష్ణా యాత్ర సర్వీసెస్

యస్.ఆర్.కె. టూర్స్& ట్రావెల్స్, హెడ్ ఆఫీస్ 120/1, ఓల్డ్ నెం:216/1, రామకృష్ణ మఠం రోడ్, (శ్రీ రామకృష్ణ మఠం ఎదురుగా)
మైలాపూర్, చెన్నై-600 004. ఫోన్: 044-24616968, సెల్: 94431 44808 / 94440 91428
ఫ్యాక్స్ : 044-24620631, Email : srk.yatraservices@gmail.com ; gs.anandhan@yahoo.in
విజయవాడ ఫోన్: 0866-2578047, సెల్: 94906 35158

యాత్రికులకు శుభవార్త

1. శ్రీ రామకృష్ణ యాత్ర	:	కలకత్తా బేలూరు మఠం గురుపీఠ దర్శన్, కామార్పుకూర్, జయరాంబాటీ మరియు కలకత్తా పరిసర ముఖ్య ప్రదేశాలు - 7 రోజుల యాత్ర.
2. కైలాస మానస సరోవర యాత్ర	:	మే-ఆగష్టు మాసాల్లో (ఖాట్మాండు నుండి ఖాట్మాండు వరకు) కైలాస మానససరోవర యాత్ర ఎకోట్రెక్ నేపాల్ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించబడును. నేపాల్, పశుపతినాథ్, ముక్తినాథ్, మనోకామన శక్తి పీఠం ప్రదేశములు ప్రత్యేకంగా దర్శించుటకు ఏర్పాటు చేయబడును-16 రోజుల యాత్ర.
3. కాశీయాత్ర	:	పూరీ, భువనేశ్వర్, కోణార్క్, గయా, కాశీ, అలహాబాద్-14 రోజుల యాత్ర.
4. బృందావన యాత్ర	:	మథుర, బృందావన్, గోవర్ధన గిరి పరిక్రమ, అయోధ్య, కాశీ, అలహాబాద్-12 రోజుల యాత్ర.
5. చార్‌ధామ్ యాత్ర	:	ఢిల్లీ, హరిద్వార్, హృషీకేశ్, బద్రీనాథ్, కేదార్‌నాథ్, గంగోత్రి, యమునోత్రి-14 రోజుల యాత్ర.
6. అమర్‌నాథ్ యాత్ర	:	అమర్‌నాథ్ మరియు వైష్ణోదేవి యాత్ర ఏర్పాటు చేయబడును.
7. నవ జ్యోతిర్లింగ యాత్ర	:	వైద్యనాథ్, నాగేశ్వర్, ఘృష్ణేశ్వర్, త్ర్యంబకేశ్వర్, భీమశంకర్, సోమేశ్వర్, మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, మల్లికార్జున-16 రోజుల యాత్ర.
8. సింధుదర్శన్ యాత్ర	:	సింధునది పుష్కరాల సందర్భంగా సింధుదర్శన్ యాత్ర చేయబడును.

చెన్నై నుండి తమిళనాడు మరియు కేరళ యాత్ర ఏర్పాటు చేయబడును.
కొత్త పాస్‌పోర్టునకు, పాస్‌పోర్ట్ రెన్యూవల్‌నకు, విమాన టిక్కెట్లు/రైలు/బస్సు టికెట్లు, వీసా, డొమెస్టిక్/ ఇంటర్‌నేషనల్ సర్వీసులకు సంప్రదించండి.

మలేషియా, సింగపూర్, థాయ్‌లాండ్, హాంగ్‌కాంగ్, శ్రీలంక, అండమాన్-నికోబార్ దీవుల యాత్రలు ఏర్పాటు చేయబడును.

సదా మీ సేవలో
(ఆధ్యాత్మి సేవా పరాయణుడు) జి. యస్. ఆనందన్

ADVT.

With Best Compliments From
పక్యాల భాస్కర రావు, మేనేజింగ్ డైరక్టర్ & పక్యాల గిరిజ, డైరక్టర్

SVISS LABSS LTD.,

(Manufacture of Bulk Drugs / Drugs Intermediates)
An ISO 9001 : 2000 Certified Company

No.88-89, Phase - II, Sipcot Industrial Complex,
Ranipet - 632 403, Tamil Nadu.

Web Site : www.svisslabss.com
E-Mail : rao@svisslabss.com

"Are you growing spiritually? Can you love others? Can you feel oneness with others? Have you peace within yourself? And do you radiate it around you? That is called spiritual growth, which is stimulated by meditation, inwardly, and by work done in a spirit of service outwardly." ***- Swami Ranganathananda***

ADVT.

నా జీవితంలో స్వామి వివేకానంద

స్వామీజీ ఇచ్చిన అస్త్రాలు

– మసనం సీతారామయ్య

మా ఊరు కృష్ణా జిల్లా, చాట్రాయి మండలంలో చిట్టచివరి గ్రామం చిన్నంపేట.

మా నాన్న గారైన మసనం సత్యనారాయణకు ఆధ్యాత్మిక చింతన ఎక్కువ. వారు నా చిన్నతనం నుంచి భారత, రామాయణ, భాగవత, భగవద్గీతలలోని అంశాలను పర్వదినాలలో పురాణ కాలక్షేపాలుగా చెబుతూ, గ్రామస్థులకు ఆధ్యాత్మిక చింతన కలుగజేస్తున్నారు. ఆ క్రమంలో నాన్నగారు స్వామి వివేకానందుల 'సందేశ తరంగిణి' మూడు భాగాలు తెప్పించుకొని చదివారు. ఆ రోజుల్లో నేను 10వ తరగతి చదువుతున్నాను. అప్పట్లో చిన్న చిన్న నవలలు చదివే అలవాటున్న నేను 'సందేశ తరంగిణి'ని కూడా చదివాను. నవలల్లో లేని సందేశాత్మక సమాచారం అందులో ఉందని గ్రహించగలిగాను. కర్తవ్యబోధ కొంత, అర్థం కాని వేదాంతం, నవలల్లో లేని కొత్తదనం కనిపించాయి. అలా వివేకానందుల వారి పుస్తకాలు తరచూ చదువుతుండేవాడిని. కాలక్రమంలో బి.కామ్, బి.ఇడి. పూర్తిచేసుకొన్నాను. ఉపాధ్యాయునిగా కృష్ణా జిల్లాలోని విస్సన్నపేట మండలంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నాను. అప్పటి నుంచి స్వామి వివేకానందుల భావాలను విద్యార్థులలో జొప్పిస్తున్నాను.

"భారత మాత బిడ్డగా పుట్టి, మాత చల్లని ఒడిలో కమ్మగా పెరిగి, తల్లి స్తన జ్ఞానామృతం తాగి, ఉన్నత శిఖరాలను అధిరోహించి, మాత పరమ వైభవ స్థితి కోసం పాటుపడని ప్రతి వ్యక్తీ దేశద్రోహే" అనే స్వామీజీ ఆవేదనా భరిత సందేశాన్ని నరనరాన జీర్ణింప చేసుకొన్నాను. అప్పటి నుండీ 'ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్రతుల్యమైన మనస్సు, త్యాగం, శీలం, సేవ, అకుంఠిత దీక్ష' అనే అస్త్రాలాంటి స్వామీజీ వచనాలను విద్యార్థులకు అందిస్తున్నాను. స్వామీజీ స్ఫూర్తి భావనలను విద్యార్థులకు అందించగలగడం నా పూర్వజన్మ సుకృతం! ❖

మసనం సీతారామయ్య, విస్సన్నపేట, కృష్ణా జిల్లా

'స్ఫూర్తి భావనలకు స్వాగతం'

జీర్ణమయిన దుస్తుల్ని త్యజించినట్లు ఈ శరీరాన్ని త్యజించినా నా భావాలతో ముందు తరాలను నిరంతరం చైతన్య పరుస్తూనే ఉంటాను అనేవారు స్వామి వివేకానంద. విశ్వానికే ఆత్మవిశ్వాసాన్ని ప్రబోధించిన యుగపురుషుడాయన. ఆబాల గోపాలాన్నీ ఉత్తేజపరిచే ఉత్తుంగ చైతన్య సాగరం స్వామీజీ.

స్వామి వివేకానంద ఈ ప్రపంచం నుంచి భౌతికంగా నిష్క్రమించి ఒక శతాబ్దం అయినా వారి స్ఫూర్తి మాత్రం ఆచంద్రార్కం మనల్ని మేల్కొలుపుతూనే ఉంటుంది. అలా ఆ మహనీయుని జీవితంతో ఉత్తేజితులైన వారి అనుభూతులకు, అనుభవాలకు 'శ్రీరామకృష్ణ ప్రభ' స్వాగతం పలుకుతోంది.

స్వామి వివేకానంద జీవితంలోని ఒక సంఘటన కావచ్చు, సంభాషణ కావచ్చు.... ఉత్తరం కావచ్చు, ఉపన్యాసం కావచ్చు... ఏదైనా మిమ్మల్ని మహత్తరంగా ప్రభావితం చేసి ఉంటుంది. ఆ అనుభూతిని, అనుపమానమైన స్ఫూర్తిని 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులతో పంచుకోండి.

సమస్యల సాగరంలో చిక్కుకొని చుక్కాని లేని అగమ్యగోచరమైన నేటితరానికి స్వామి వివేకానంద సాహిత్యం ఆశాదీపమని మీ అనుభవాలు నిరూపిస్తాయి. మీ అనుభవాలను, అనుభూతులను వ్రాసి మీ ఛాయాచిత్రం (కలర్ ఫోటో)తో సహా పంపిస్తే 'నా జీవితంలో స్వామి వివేకానంద' అనే శీర్షికలో ప్రచురిస్తాం.

మీ అనుభవాలను, భావనలను పంపవలసిన చిరునామా
'నా జీవితంలో స్వామి వివేకానంద'
శ్రీరామకృష్ణ ప్రభ, రామకృష్ణ మఠం,
దోమల్ గూడ, హైదరాబాద్ – 500 029

అపజయాలు విజయభవనానికి సోపానాలు

– డా॥కరిమద్దెల నరసింహారెడ్డి

ఛిన్నో౽పి రోహతి తరుః
క్షీణో౽ పృపచీయతేపునశ్చంద్రః
ఇతి విమృశంతః సంతః
సంతప్యంతే న విప్లుతా లోకే
– భర్తృహరి

"చెట్టుని నరికినా అది తిరిగి చిగురిస్తుంది. చంద్రుడు క్షీణించినా తిరిగి వృద్ధి చెందుతాడు అని తలచి లోకంలో సజ్జనులైనవారు దుఃఖించరు. కష్టాలు వచ్చినా, అపజయాలు ఎదురైనా బాధపడరు". "No pain no gain, No rain no grain – కష్టాలు లేకుండా ఫలితాలురావు, వర్షాలు పడకుండా పంటలు పండవు" అని అంటారు అనుభవజ్ఞులు.

"Every successful person has a painful story.
Every painful story has a successful ending"

బాధపడకుండా ఎవరూ విజయం సాధించలేరు. విజయం సాధించిన వారందరూ బాధపడినవారే అన్నమాట కేవలం నోటిమాట కాదు, ఉన్నమాటే! విజయాన్ని తెలిపే ప్రతీ కథలోనూ అపజయాన్ని గురించిన కథదాగి ఉంటుంది. చరిత్రను అధ్యయనంచేస్తే విజయాన్ని తెలిపే కథలన్నీ అపజయాన్ని కూడా తెలిపేవిగా ఉంటాయి. విజేతలందరూ అపజయాలను సోపానాలుగా చేసుకొని విజయభవనంలోకి ప్రవేశించినవారే. వారందరిలో అగ్రగణ్యుడు అబ్రహాం లింకన్.

అధ్యక్ష పదవిని అందించిన లింకన్ పరాజయాల పరంపర

1830 నుంచి 1859 వరకు అబ్రహాం లింకన్ వరుసగా వ్యాపారంలోనూ, ఉద్యోగ ప్రయత్నంలోనూ, రాజకీయాల్లోనూ ఎన్నో అపజయాల్ని చవిచూశాడు. చివరికి 1860లో అమెరికా అధ్యక్షునిగా విజయం సాధించాడు.

ఇన్ని అపజయాలు ఎదురైనా, ఎన్ని ఓటముల పాలైనా లింకన్ బాధపడలేదు. చెట్టును స్ఫూర్తిగా తీసుకున్నాడు. చివరికి విజయభవనంలోకి ధీరగంభీరంగా ప్రవేశించాడు.

విమానాల రూపకల్పనలో రైట్ సోదరులు

రైట్ సోదరులు విమానాన్ని కనిపెట్టేటప్పుడు చాలాసార్లు అపజయం పాలయ్యారు. 1903 డిసెంబరు 17న ఉదయం వారు తయారు చేసిన విమానం 12 సెకెండ్లు మాత్రమే ప్రయాణించి పడిపోయింది. రెంవసారి 59 సెకెండ్లలో 852 అడుగులదూరం పయనించి పడిపోయింది. మూడవసారి అసలు ఆకాశంలోకి ఎగరనేలేదు. 1908లో రెండు గంటల ఇరవై నిమిషాలపాటు ఆకాశంలో ఎగిరి పడిపోయింది. చివరికి 1909 నాటికి రైటు సోదరులు పలు దేశాల్లో, ప్రదేశాల్లో తమతోపాటు ఇతరులను కూడా తీసుకొని వెళ్ళే విమానాన్ని నడిపించారు. 1911 వరకూ విమానాల తయారీలో వారికి తిరుగులేదు. తర్వాత యూరప్ దేశాలు సొంతంగా విమానాలను తయారు చేసుకోవడం ప్రారంభించాయి.

'మిక్కీమౌస్' రహస్యం

కార్టూనిస్టు వాల్ట్‌డిస్నీ తన బొమ్మలను విక్రయించడానికి ఎందరో పత్రికా సంపాదకుల చుట్టూ తిరిగాడు. ఒక్క బొమ్మను కూడా అమ్మలేకపోయాడు. అపజయం అతనిని ఆవరించి బాధించింది. ఒకరోజు అతనిని ఒక చర్చి ఫాదర్ కొన్ని కార్టూన్లు వేసివ్వమని కోరాడు. చర్చిదగ్గర ఒక షెడ్డులో డిస్నీ నివసించేవాడు. ఆ షెడ్డులో ఎలుకలు తిరుగుతూ ఉండేవి. ఒకరోజు ఒక ఎలుక పై నుండి కిందికి దూకింది. దూకేటప్పుడు దానికి చొక్కా ఒకటి తగులుకుంది. దాని నుండి తప్పించుకోవడానికి అది తంటాలు పడుతుండగా డిస్నీ చూశాడు. అతడు దాన్ని కార్టూన్‌గా గీసాడు. అదే ప్రపంచ ప్రఖ్యాతి చెందిన మిక్కీమౌస్.

Failure is the womb of success
Failure is the high way to success
Failure is the stepping stone to success. ❖

అవకాశం సర్వాంతర్యామి

- గంపా నాగేశ్వర్ రావు



అవకాశాలను గమనించి అందుకోవడంలోనే మన విజయం ఆధారపడి ఉంది.

ఒక కుర్రవాడికి చిన్నతనం నుండీ అతని తల్లితండ్రులు ఎలాంటి కష్టం వచ్చినా భగవంతుడిని ప్రార్థిస్తే ఆయన తప్పక మనల్ని రక్షిస్తాడని బోధించేవారు. కాలగమనంలో అతను పెద్దవాడయ్యాడు. అతని తల్లితండ్రులు కాలధర్మం చెందారు. ఇలా ఉండగా ఒకనాడు తుఫాను వచ్చి వారి ఊరంతా జలమయమయ్యింది. ప్రజలంతా తట్టా బుట్టా సర్దుకుని ఆ ఊరు వదిలి వెళ్ళిపోతున్నారు.

"సోముడూ! మా బండిలోకి ఎక్కు త్వరగా వెళ్ళిపోదాం లేదంటే ఈ నీటిలో మునిగిపోతావు" అంటూ ఆహ్వానించాడు అతని పొరుగువాడు. "లేదు బాబాయ్! నేను దేవుడి కోసం ఎదురుచూస్తున్నాను" అని సమాధానమిచ్చి తన మేడమీదకి ఎక్కాడు అతడు. కొంత సమయానికి ఆ ఊరంతా జలమయమయ్యింది. కొంతమంది పడవలో వెళుతూ అతనిని తమ పడవలోకి ఎక్కమని ఆహ్వానించారు. కానీ అతను అక్కడి నుండి కదలలేదు. నీటి మట్టం పెరుగుతూనే ఉంది. అతను మాత్రం భగవంతుని కోసం ఎదురు చూస్తూనే ఉన్నాడు. చివరికి హెలీకాప్టర్ నుండి నిచ్చెన జారవిడిచి ఎక్కమన్నా అతను ఎక్కలేదు. దాంతో అతను చనిపోయి స్వర్గానికి చేరాడు. అక్కడ దేవుడిని చూడగానే కోపంగా "నేను నిన్ను నమ్ముకొని ఉంటే నువ్వు మాత్రం నన్ను రక్షించడానికి రాలేదు" అని నిందించాడు.

భగవంతుడు చిన్నగా నవ్వి "నాయనా! నేను నీ కోసం ఒక బండినీ, పడవనీ, హెలికాప్టర్‌ని కూడా పంపాను. కానీ వాటిని నువ్వు ఉపయోగించుకోలేదు. దానికి నేనేం చేయను" అని ప్రశ్నించాడు.

అర్థమయిందా? మనలో చాలా మంది పై కథలోని వ్యక్తిలాగ ఎదురుగా ఉన్న అవకాశాలను కూడా పట్టించుకోవడం లేదు. మీ లక్ష్యం ఒక కోటి రూపాయలు సంపాదించడం కావచ్చు. కాని మీ వద్దకు వెయ్యి రూపాయలు సంపాదించగలిగే అవకాశం వచ్చినప్పుడు దానిని ఉపయోగించుకోవాలి. అంతేగాని "ఇది నా స్థాయికి సరిపోని పని" అనో లేక మరొకటో అని మీరు దానిని నిర్లక్ష్యం చేయకూడదు. ఏమీ లేనప్పుడు దొరికిన దానినే మనం ఆలంబన చేసుకోవాలి. ఆ తరువాత అంతకన్నా మంచి అవకాశం దొరికినప్పుడు దానిని అందుకోవాలి. ఇలా వచ్చిన అవకాశాలను ఉపయోగించుకుంటూ వెళ్ళడమే విజేత లక్షణం. కావాలంటే మీరు ఏ విజేతనైనా గమనించండి. వారు తమకు వచ్చిన చిన్న చిన్న అవకాశాలను ఉపయోగించుకుంటూ నేడీ స్థాయికి వచ్చారు. కాబట్టి ఏ అవకాశాన్నీ నిర్లక్ష్యం చెయ్యవద్దు.

అవకాశాలనేవి నిశ్శబ్దంగా వస్తాయి. వాటిని గుర్తించి ఉపయోగించుకునే బాధ్యత మనదే. ❖

పండుగలు - పర్వదినాలు

ఏప్రిల్- 2009

03	శుక్రవారం	: శ్రీరామనవమి
05	ఆదివారం	: ఏకాదశి
21	మంగళవారం	: ఏకాదశి
27	సోమవారం	: అక్షయ తృతీయ
29	బుధవారం	: ఆది శంకరాచార్యుల జయంతి

మే- 2009

05	మంగళవారం	: ఏకాదశి
07	గురువారం	: నృసింహ జయంతి
09	శనివారం	: బుద్ధపూర్ణిమ
19	మంగళవారం	: హనుమజ్జయంతి
20	బుధవారం	: ఏకాదశి

...17వ పేజీ తరువాయి.

ఊరి మధ్యలో ఏర్పాటు చేసిన త్రాసు వద్ద ప్రజలు బంగారంతో బారులు తీరారు. ఒక వ్యక్తి కొంత బంగారాన్ని త్రాసులో వేశాడు. అప్పుడు ఒక అద్భుతం జరిగింది!
అరే! ఎంత బంగారం వేసినా గుమ్మడి కాయకు సరితూడగం లేదే! ఎంత ఆశ్చర్యం!!
ఇంకొక వ్యక్తి కొద్దిగా వేయగానే త్రాసు తులతూగింది.
ఇదేదో అతీత శక్తి ఉన్న ధర్మకాటాలా ఉంది. న్యాయంగా ఎంత బాకీ ఉన్నామో అంత బంగారాన్నీ చెల్లిద్దాం!
ఈ సంగతి రాముడికి తెలిసింది. రాముడు, లక్ష్మణుణ్ణి పిలిచి...
ఒకే గుమ్మడి కాయ బరువు ఇన్ని రకాలుగా తూగుతోందా? అదెలా సాధ్యం! దీనిలో ఏమైనా మోసం ఉందా? ఇందులో మీ ప్రమేయమేమీ లేదు కదా?
అన్నగారూ! ఇదంతా ధర్మ దేవత ఆజ్ఞానుసారమే జరిగింది.

ఎవరెంత చెల్లించాలో, ధర్మ దేవత దగ్గరుండి మార్గదర్శనం చేస్తుంటే హనుమంతుడు త్రాసు ముల్లును సరియైన దిశగా కదిపాడు. కాబట్టి ఎవరికీ అన్యాయం జరిగే అవకాశం లేదు!
అప్పుడే... “అవును! ఇందులో అధర్మం అంటూ ఏమీ లేదు” అని ఆకాశవాణి పలికింది.
లక్ష్మణుడు ఇచ్చిన సమాధానంతో రాముడు సంతుష్టుడయ్యాడు. ప్రజలు చెల్లించిన పన్నులతో ఖజానా అంతా నిండిపోయింది.
అప్పటి దాకా అదృశ్యంగా ఉన్న హనుమంతుడు ప్రత్యక్షమై, శ్రీరాముడికి పాదాభివందనం చేశాడు.
మీ అనుమతి లేకుండా ఈ సాహసం చేసినందుకు క్షమించండి స్వామీ.
లేదు హనుమా! నేనే తొందరపడ్డాను ఎప్పుడూ ధర్మమే జయిస్తుంది.

గ్రంథ పరిచయం

హైదరాబాద్ రామకృష్ణ మఠం వారి

నూతన ప్రచురణలు

ప్రతులకు : తెలుగు ప్రచురణల విభాగం
రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాద్- 500 029
Email : rktelugubook@gmail.com ఫోన్. 040-2763 1149

ముండకోపనిషత్తు

వ్యాఖ్యాత : స్వామి జ్ఞానదానంద
పేజీలు : 96, వెల : 20/-

మన ప్రాచీన ఋషివరేణ్యుల అనుభవపూర్వక సత్యాలే ఉపనిషత్తులుగా పేర్కొనబడ్డాయి. నిజమైన సాధనామయ జీవితాన్ని గడుపుతూ, మనశ్శరీరాలను పావనం చేసుకుని భగవదభిముఖంగా మనం ముందుకు సాగేకొద్దీ ఉపనిషత్తులలోని ఆంతరిక సత్యాలు మనకు అవగతం కానారంభిస్తాయి.

నీడను నిజంగా ఎంచి దాని వెనుక మనం పరుగులెత్తుతున్నాం. అపమార్గంలో చేసే ఈ పయనమే మన నిరాశలకూ, నిస్పృహలకూ, కష్టనష్టాలకూ కారణం. 'నీడను వీడి నిజాన్ని చూడు' అని ఈ ఉపనిషత్తు ఉపదేశిస్తున్నది.

శరీరం, మనస్సు, ఆత్మ ఇత్యాదిచే రూపొందిన వాడు మనిషి. వీటిలో శరీరమూ, మనసు నశించిపోయేవి, నీడ. ఆత్మ నశించనిది, నిజం. నీడలో మనం తాదాత్మ్యం చెందడాన్ని వదలిపెట్టి, నిజంతో తాదాత్మ్యం చెందమంటున్నది ఈ ముండకోపనిషత్తు. సాధారణ జ్ఞానం - ఉన్నత జ్ఞానం, భోగమూ-సన్న్యాసమూ, జ్యోతి-జ్వాల, నిన్ను తెలుసుకో, నీడ-నిజం, భగవదనుభూతి- అనే ఆరు శీర్షికల క్రింద ఈ ఉపనిషత్తు వ్యాఖ్యానించబడింది. ప్రతి ఒక్కరూ అలవోకగా అర్థం చేసుకోవడానికి అనువుగా వ్యాఖ్యానం సులభశైలిలో సాగింది. ❖

- బ్రహ్మచారి హేమంత్

పరమశివుడు
తత్త్వము, స్తోత్రములు



పేజీలు :120, వెల:15/-

గమనిక : ప్రతులకు పై చిరునామాను సంప్రతించండి.
పై పుస్తకాలను పోస్ట్‌లో పొందగోరేవారు పోస్ట్ ఖర్చుల నిమిత్తం రూ.20/- అదనంగా పంపవలెను.

స్వయంభువు మల్లాం
శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మాహాత్మ్యం

రచయిత : అప్పాజీ వేంకట సుబ్రహ్మణ్యం, పేజీలు : 148, వెల: రూ. 25/-, ప్రాప్తిస్థానము: శ్రీ శరవణభవ నిలయం, 1-4-54, బ్రాహ్మణవీధి, నాయుడుపేట, నెల్లూరు జిల్లా.



యోగసాధకులకు "శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి" వారు ఆరాధ్యదైవం. స్వామివారి విశేషాలు శివపురాణం, స్కంద పురాణాల్లో మనం చూడవచ్చు. మల్లాం నెల్లూరు జిల్లాలో ఉంది. ఇక్కడ ఉన్న శ్రీ సుబ్రహ్మణేశ్వర స్వామి స్వయంభువు. రచయత ఈ గ్రంథంలో శ్రీ సుబ్రహ్మణ్యుని పూర్వజన్మవృత్తాంతాన్నీ, జన్మవృత్తాంతాన్నీ పురాణాధారాలతో చక్కగా వివరించారు. అలాగే తమిళనాట గల ఆరు ప్రముఖ సుబ్రహ్మణ్య క్షేత్రాలను గురించి తెలియజేశారు. శ్రద్ధాళువులైన భక్తులకు 'శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి పూజా విధానాన్ని అనుబంధంగా ఈ గ్రంథంలో అందించటం విశేషం. రచయిత కృషి... భక్తి అభినందనీయం. ❖

- ఎమ్.వి. నాగ ప్రసాద్

శ్రీ ఇంద్రేశ్వర చరిత్రము

రచయిత : కపిలవాయి లింగమూర్తి
పేజీలు : 90, వెల : 100/-,
ప్రాప్తిస్థానం : కె. కిశోర్ బాబు, వాణీ సదనం, 17-110, విద్యానగర్ కాలనీ, నాగర్‌కర్నూలు-509 209.

శ్రీరామ-ఆంజనేయ శతకద్వయము



రచన: శ్రీ కాంతం సత్యనారాయణ
పేజీలు : 32, వెల:35/-,
ప్రాప్తిస్థానం: 1-1-650/22, ఎస్.బి.ఐ. కాలనీ రోడ్, గాంధీనగర్, హైదరాబాద్-80

సేతు రహస్యం

రచన: గంగ శ్రీనివాస్
పేజీలు : 168, వెల:150/-,
ప్రతులకు: శ్రీమతి జి. గంగ శ్రీనివాస్, నెం.953/2, సౌత్ లాలాగూడ, సికింద్రాబాద్-500 017.

రామకృష్ణ మిషన్ కేంద్రాల సంక్షేమ కార్యక్రమాలు

విజయవాడ రామకృష్ణ మిషన్ 2008 డిసెంబరు నుంచి 2009 మార్చి వరకు గుంటూరు, కృష్ణా, ఖమ్మం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన 16 మండలాల్లో సంక్షేమ కార్యక్రమాల్ని నిర్వహించింది. ఈ సంక్షేమ పథకం క్రింద ఉచితంగా 1844 మంది విద్యార్థులకు యూనీఫారాలు, 300 మందికి కంచాలు, 197 మంది వికలాంగులు, వృద్ధులు, వితంతువులకు ధోవతులు, దుప్పట్లు, తువ్వాళ్ళు, చీరలు, రవికలు పంపిణీ చేసింది. 240 మంది పదవ తరగతి విద్యార్థులకు శిక్షణా తరగతుల్నీ, 190 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజన సదుపాయాన్నీ ఏర్పాటు చేసింది. విజయనగరం పూల్‌బాగ్ లెప్రసీ కాలనీలో, సీతానగరం అన్నపూర్ణ పాఠశాలలో రెండు గొట్టం బావులను వేయించింది.

ఈ సంక్షేమ కార్యక్రమాల నిమిత్తం మొత్తం 7,78,000/– రూపాయల్ని వెచ్చించింది. ❖ **నివేదిక : స్వామి స్వసంవేద్యానంద**

బెల్గామ్ రామకృష్ణ మిషన్ ఆశ్రమ ప్రతీ నెల నిరుపేద కుటుంబాలకు కిరాణా సామాగ్రిని ఉచితంగా పంపిణీ చెయ్యాలని 'ద్రవ్యయజ్ఞ' పథకాన్ని చేపట్టింది. ఈ పథకం క్రింద 2009 ఫిబ్రవరి నెలలో 75 నిరుపేద కుటుంబాలకు 375 కిలోల చొప్పున బియ్యం, గోధుమ పిండి; 75 కిలోల చొప్పున వంటనూనె, పప్పుదినుసుల్ని పంపిణీ చేసింది. ❖

నివేదిక : స్వామి రాఘవేశానంద

పశ్చిమ ఫిజీ-విటిలేవు పట్టణంలో 2009 జనవరిలో సంభవించిన భారీ వర్షాల కారణంగా అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. వరదలకు గురైన ప్రాంతాల్లో **ఫిజీ రామకృష్ణ మిషన్** తక్షణ సహాయక చర్యల్ని చేపట్టింది. సుమారు 1000 మంది బాధిత కుటుంబాలకు నిత్యావసర సామాగ్రిని, మందులను, వస్త్రాలను సరఫరా చేసింది. ఈ సహాయక కార్యక్రమాల కోసం సుమారు నాలుగు లక్షల రూపాయల్ని ఖర్చు చేసింది. ❖ **నివేదిక : స్వామి తదానంద**

'భక్తి' ఛానల్‌లో రామకృష్ణ మఠ కార్యక్రమం

ప్రతీ సోమవారం సాయంత్రం 5 గంటల నుండి 5.30 వరకు హైదరాబాద్ రామకృష్ణ మఠ అధ్యక్షులు **స్వామి జ్ఞానదానందజీ మహరాజ్** వారి ఆధ్యాత్మిక ప్రసంగం, భజనలు 'భక్తి' ఛానల్‌లో ప్రసారం అవుతాయి. భక్తులు ఈ కార్యక్రమాన్ని తిలకించి ఆనందించగలరు.

శ్రీ పరమాచార్య చన్ద్రశేఖరేన్ద్ర సరస్వతీ వేదాధ్యయనానుసన్ధాన ప్రతిష్ఠానమ్

ప్రవేశ / ఉద్యోగ ప్రకటన

1. అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ క్రింది కోర్సులకు దరఖాస్తులు కోరబడుచున్నవి.

(అ) 'వేదచూడామణి' : ఋగ్వేదము/ సామవేదము/ అథర్వవేదము యొక్క అధ్యయనము
యోగ్యతలు : మాతృభాషలో చదువగలిగి, వ్రాయగలిగి ఉండాలి.
వయస్సు : 8 నుంచి 10 సంవత్సరాల మధ్య
స్టైఫండ్ : నెలకు రూ. 1,000/-

(ఆ) 'వేదార్థచూడామణి' : ఋగ్వేదము/ యజుర్వేదము/ సామవేదము/ అథర్వవేదము యొక్క భాష్యాధ్యయనము
యోగ్యతలు : సంస్కృత పరిజ్ఞానముతో బాటు ఏదో ఒక వేదాన్ని పూర్తిగా అధ్యయనం చేసి ఉండాలి.
వయస్సు : 15 సం॥, ఆ పైన
స్టైఫండ్ : నెలకు రూ. 3,000/-

2. అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ క్రింది ఉద్యోగాలకు దరఖాస్తులు కోరబడుచున్నవి.

(అ) వేదాధ్యాపకుడు : (సామవేదము/ అథర్వవేదము - వేదానికి ఒక్కొక్కరు చొప్పున రెండు ఖాళీలు)
కావలిసిన అర్హతలు : క్రమాంతము లేక పదాంతము
అదనపు అర్హతలు : ఏదైన మఱియొక వేదము/ వేదభాష్యము/ శాస్త్రము యొక్క పరిజ్ఞానము
అనుభవము : 2 సంవత్సరములు
సంభావన : నెలకు రూ॥ 8,000/- మొత్తము, సౌకర్యములతో

(ఆ) వేదభాష్యాచార్యుడు : (ఒక్కొక్క వేదానికి ఒక్కొక్కరు చొప్పున 4 ఖాళీలు)
విద్యార్హత : ఏదైనా వేద భాష్యంలో ఉత్తీర్ణత
అదనపు అర్హత : మరొక వేద భాష్యము/ శాస్త్రము యొక్క పరిజ్ఞానము
అనుభవార్హత : 5 సం॥
సంభావన : నెలకు రూ. 10,000/- మొత్తము, సౌకర్యములతో

ముద్రించిన దరఖాస్తు ఫారములను **శ్రీ పి. వేంకటేశ్వర్లు గారు, మేనేజింగ్ డైరెక్టర్, కాకతీయ సిమెంట్, సుగర్ & ఇండస్ట్రీస్ లిమిటెడ్, 'గురుకృప' (ఆంధ్రా బ్యాంకు ఎదురుగా), 1 - 10 - 140/1, అశోక్‌నగర్, హైదరాబాద్ - 500 020** (ఫోను: 040 - 27637717) నుంచి ప్రత్యక్షముగా గాని, పోస్టు ద్వారా గాని పొందవచ్చు. పూర్తి చేయబడిన ఆ ముద్రిత దరఖాస్తులను ఈ పై అడ్రసుకు పంపవలెను. అవసరాన్ని బట్టి ఖాళీలను పూరించుట లోనూ, అర్హతల సవరణ లోనూ మేనేజ్‌మెంటుకు అధికారము కలదు.

సం/-
కులప్రశాసకుడు

హైదరాబాద్

Sponsored by:

KAKATIYA CEMENT SUGAR & INDUSTRIES LIMITED

Regd. Office : 1 - 10 - 140/1, Gurukrupa, Ashok Nagar, Hyderabad - 500 020
Ph: 2763 7717, 2763 3627, Fax No. 040-27630172, Email: info @ kakatiyacement.com

Printed and published by **Swami Jnanadananda** owned by Ramakrishna Math Trust
and printed at Kala Jyothi Process, 1-1-60/5, RTC Cross Roads, Musheerabad, Hyderabad - 500 020
and published at Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029. **Editor: Swami Parijneyananda**